# సాయి సూక్తులు

మాస్టర్ కె. పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2006

ప్రతులు : 1,000

వెల : రూ॥ **50-00**

ప్రాప్తిస్థానము :
జగద్గురు మందిరము
(ది వరల్డ్ టీచర్ టెంపుల్)
'రాధామాధవమ్', 14-38-2, ముప్పిడి కోలనీ,
విశాఖపట్నం - 530 002.

ముద్రణ :
ఎక్సేల్షియర్ ప్రింటింగ్ స్కూల్
విశాఖపట్నం - 530 016.
☏ 2747320, 9848075132.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శృతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ",** డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపము లోను, గ్రంథముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము" గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## *సంకలనకర్త : మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్*

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలో గల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియ వచ్చును. అవి బోధనలుగానే కాక నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించుచున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని శ్రీ కుమార్‌గారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచుచున్నారు.

శ్రీ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతులైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. *"పరహితము పరమధర్మ"* మను ఆర్యోక్తి వారి జీవితమును నడి పించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ ఫౌండేషన్**

# సాయి వైభవము

సాయి అనుగ్రహముగ "సాయి సూక్తులు" వెలువడినవి. సాయి మహిమ లందరికిని తెలియును. సాయి బోధన కొందరికే తెలియును. సాయి సూక్తులు సాయి నుండే అందింపబడినవి.

సాయి మార్గము సమగ్రము. సాయి తత్త్వము ప్రేమ తత్త్వము. సాయి పరమ భాగవతులు. వారందించిన మార్గము కూడ భాగవత మార్గమే. పిలిచిన పలికెడి దైవముగ ఏడు కొండల శ్రీనివాసుడున్నాడు. పిలిచిన పలికెడి సద్గురువుగ సాయినాథు డున్నాడు.

సాయి చూపినది ముఖ్యభక్తి. ముఖ్యభక్తి అనగ నిరంతర భగవదనురక్తి. భగవంతుని యందు గల అనురక్తియే నిజమగు భక్తి. అనురక్తి యనగ నిత్యరక్తి. సామాన్యముగ రక్తి యుండును గాని అనురక్తి యుండుట పూర్ణ ప్రేమ యున్నపుడే జరుగును. భాగవతమున ప్రహ్లాదుడు, అంబరీషుడు అట్టి భక్తిని ప్రదర్శించి నారు. ద్వాపర యుగమున గోపికలట్టి భక్తి ప్రదర్శించినారు. ముఖ్యభక్తిని శ్రీకృష్ణ భగవానుడు అనన్య భక్తిగను, పర్యుపాసనగను, సతతయుక్తతగను భగవద్గీత యందు తెల్పియున్నాడు.

ముఖ్యభక్తి యందు భగవంతుడే ప్రధానము. ఇతరము లప్రధానములు. ఇట్టివారు పానీయములు త్రాగుచునున్నను, అన్నము గుడుచుచున్నను, యితరులతో మాట్లాడుచున్నను,

నిద్రయందును గూడ దైవమును మరువరు. ఆచారములు, దినచర్య అంతయు అప్రయత్నముగనే సాగును. వీరి ఆచారము అతి స్వతంత్రముగ నుండును. వీరిపై ఆచారపు ఆంక్షలు పని చేయవు. అట్లని యితరులను అనాచారములకు లోనుచేయరు.

బూజుపట్టిన విశ్వాసములు, ఆచారములు, మూఢ నమ్మకములు మానవుని రకరకములుగ బంధించునపుడు వారి భావ బంధచ్ఛేదనమునకే సద్గురువులు శరీరధారులై మనమధ్య మెలగుదురు. వారిని వారు ప్రకటించుకొనక, గూఢులై యుండియు సాధు సజ్జనులకు చల్లని స్పర్శనిచ్చి నుద్ధరింతురు. వారు ఏ సిద్ధాంతమునకు లోబడి యుండరు. అన్ని సిద్ధాంతములను మన్నింతురు. కుల, మత, జాతి, ఐశ్వర్య భేదములు చూపరు. అష్టైశ్వర్యములు వారి అధీనమున నున్నను అతి సామాన్యులవలె గోచరింతురు.

సద్గురు షిరిడి సాయినాథుడు ప్రపంచమునకు కాలము రూపమున సుపరిచితుడైనాడు. ఆయన జీవనము దీన జనోద్ధారణము, సత్పురుషులకు అందించిన దైవమార్గము, అహంకారులకు అందించిన వినయము, రోగగ్రస్తుల కందించిన ఆరోగ్యము, దరిద్రుల కందించిన ధనము, పశుపక్ష్యాదులతో కూడి అన్ని జీవరాశుల యందు చూపిన ప్రేమ, అపురూపమగు వారి అగ్ని ఆరాధనము, వేషధారణము వారికి వారే సాటిగ నిర్వర్తించ బడినవి. షిరిడిసాయికి, షిరిడీసాయే సాటి. మరియొకరితో పోల్చ నలవికాదు.

అశేష భక్తకోటిని తన చల్లని స్పర్శతో నుద్ధరించు అవతార మూర్తిగ షిరిడియందు వెలసిన జగద్గురువు షిరిడి సాయినాథుడు.

స్వప్న దర్శనమొసగి, నాదైన తీరులో తన బోధనలను బీజప్రాయముగ లిఖించమని సాయి ఆదేశించగ, భ్రాంతియని తలచి మిన్నకుంటిని. మరల స్వప్న దర్శనమిచ్చి హెచ్చరించిరి. దర్శనమైనను భ్రాంతి దర్శనమేమో అన్న భావనచే, రెండవ స్వప్న దర్శనము జరిగిన మరునాడుదయము ప్రార్థన సమయమున నిదర్శనము కోరితిని. నా కార్యాలయమునకు చనగ, ఒక సాయి భక్తుడు నాకై తన కుమార్తెతో సహా వేచియుండెను. షిరిడీ సాయి పాదముల ప్రతిష్ఠ చేయవలెనని కోరెను. సాయి నిదర్శనము చూపినాడు. సూక్తుల లేఖన మారంభించితిని. 160 సూక్తులు వచ్చినవి. వాటినట్లే యుంచితిని.

కొన్ని మాసముల తరువాత సాయి మరల స్వప్న దర్శనము నిచ్చి సూక్తులను ముద్రించలేదేమి యని ప్రశ్నించిరి. నేను వ్రాసినవి సాయి సూక్తులో లేక నా భావములో నిర్ధారించుకొనలేకపోవుటచే ముద్రించలేదని స్వప్నమున పలికితిని. సాయి, “సాయి సూక్తులు” అను పేరున ముద్రించమనిరి. ఉదయము ప్రార్థనమున నిదర్శ నము వినయముతో కోరితిని. మరల కార్యాలయమునకేగగ, 7 గురు సాయిభక్తులు వేచియుండిరి. సాయి విగ్రహప్రతిష్ఠ చేయవలె నని, మందిర నిర్మాణము జరిగినదని, సాయి పాలరాయి విగ్రహము నాచే ప్రతిష్ఠింపబడవలెనని కోరిరి. అంతరంగమున

ఆనందించితిని. లేఖనమునకు పూర్వము సాయి తన పాద ప్రతిష్ఠ నను(గ్రహించినాడు. లేఖనమునకు తరువాత తన పూర్ణ విగ్రహ ప్రతిష్ఠ ననుగ్రహించినాడు. ఇక సందేహమేల?

ఆంగ్లమున పుస్తకమును ప్రచురించితిని. నా అనుయాయులలో విదేశీయులు చదివి, స్ఫూర్తిమంతులై, జర్మన్, స్పెయిన్ భాషలలోనికి అనువదించినారు. ఇరువది ఏడు (27) దేశములలో ఈ "సాయి సూక్తులు" ఎందరో దైవజిజ్ఞాసువులకు మార్గదర్శి అయినది. 9 సంవత్సరముల కిపుడు తెనుగున ప్రచురింపబడినది. అంతయు సాయి లీలయే! సద్గురువనుగ్రహము రుచి చూచితిని.

**- పార్వతీకుమార్**

శ్రీ వ్యయ నామ సం॥ము
శంకర జయంతి
2-5-2006

# సాయి సూక్తులు

1

# వాగ్దానము

* కర్తవ్యమును విస్మరించకు.
* నాపై నమ్మకము వుంచు. నీకు మనశ్శాంతి లభిస్తుంది.
* అన్నిటా నన్ను దర్శించుటకు, వినుటకు ప్రయత్నించు.
* ఈ ప్రపంచములో భయపడవలసిన దేదియూ లేదు. అంతటా "నేనే" నిండియున్నాను కదా! ఇక భయపడవలసిన దేమున్నది?
* అన్నిటా "నన్నే" దర్శనము చేస్తూవుంటే, యితరముల యందు వైరాగ్యము వున్నట్లే.
* నాతో సంయోగమే యోగము.
* నీవు 'అల'వు. నేను సముద్రాన్ని.
* నన్ను చేరి నానుండి నీవు వ్యక్తమైతే – నా ప్రేమ, జ్ఞానము, శక్తులుగా నీవు వెలువడుదువు.

2

## ఉచ్చారణము

నన్ను హృదయ పూర్వకముగ నుచ్చరించుము.
తత్కారణముగ పరిపూర్ణత నొందెదవు.

నన్ను ప్రేమ పూర్వకముగ నుచ్చరింపుము.
తత్కారణముగ నా సాన్నిధ్యము నొందెదవు.

నన్ను ప్రేమించువారికి నా ప్రేమ లభ్యమగును.
వారిని సర్వత్ర కాపాడుకొనుచుందును.

3

# సద్గురువు

నాయందు అనురాగము గలవానియందు
నే ననురాగము గలిగి యుందును.

నీ అనురాగము మేరకు నా అనురాగము
ప్రతిస్పందించును.

ప్రతిస్పందనము సద్గురువు స్వభావము.

సద్గురువు కరవు అనుకొందురు.
నిజమునకు సద్భక్తుడే కరవు.

4

# హంసధ్వని

జీవితమొక హంసధ్వని రాగము.
సోऽహం దాని భావము. అదియే సామవేదము.
ఆ రాగమునందు రుచి గొనుట యోగము.
శాశ్వతానందము ఫలశ్రుతి.

5

## వాగ్దానము

సంఘటనలయందు, ప్రతిఘటనలయందు
నన్ను దర్శించుట సాధన చేయుము.
నీ ముందున్న సన్నివేశము, సమస్య
నా స్వరూపమని ఎఱుగుము. తద్వారమున
పరిష్కారమునకు అవకాశము కల్గును.
బంధస్థితి తొలగి ముక్తస్థితి ఏర్పడును.
ఇది నా వాగ్దానము.

6

## ఒక సుళువు

నీవు నాయందున్నచో ప్రపంచము

నీకు సహకరించును.

నీవు ప్రపంచము నందున్నచో

నీకు నే నందను.

నాయందు నిలబడి ప్రపంచము ననుభవింపుము.

7

# నేను

నీవు నన్ను 'సాయి' అని పిలుతువు

అట్లే కానిమ్ము.

సాయి అని పిలువక ముందునుండి నే నున్నాను కదా!

మహల్సాపతి నన్ను 'సాయి' అనెను.

కాని నేను నేనే!!

ఈ సమస్తమును 'నేనే'.

సమస్తమునందు నన్ను దర్శించుట

వలన మాత్రమే నాయందుందువు సుమా !

'సాయి' నా సహస్రనామములలో ఒకటి మాత్రమే.

నిజానికి నేను అందరి యందలి 'నేను' ను.

8

# జ్ఞాని

నన్ను తెలిసినవాడు జ్ఞాని. అతనికి నా పేరు కూడ తెలియును. ఈ సృష్టియందలి శబ్దమునకు, వర్ణమునకు, రూపమునకు ఆధారముగ నున్న నన్ను అతడు మాత్రమే దర్శించగలడు. అతనికి అద్వైతము సత్యము. నేను కానిది అతనికి అగుపింపదు.

అతడు ప్రశాంతముగ నుండును. ప్రశాంతతకు వాహికగ గూడ నుండును. తేజస్సు అతని నుండి వెన్నెలవలె ప్రసరించుచుండును.

9

# నా ఆశ్రమము

సమస్తమునందు 'నా' భావన మరువని వాడు నా ఆశ్రితుడు. అతడు 'నా' ఆశ్రమముగ నుండును. అనగ, అతడు వాహికగ నేను వ్యక్త మగుచుందును. నా లీలావిలాసమును అతడు ముగ్ధుడై గమనించుచు ఆనందించుచుండును.

నాయందు ఉపస్థితుడై అతడు తుష్టి చెందును. సమస్తమునందు నా వైభవమును గమనించు చుండును. నా యందుండి పుట్టుక, చావు, పెరుగుదల యిత్యాదులు భ్రాంతి భావములుగ తెలుసుకొని నవ్వుకొనును.

10

# నా ధర్మము

ఇతరులను నిరాకరించుట వలన నీవునూ నిరాకరింపబడుదువు. ఇతరులకు సహాయము నిరాకరించిన నీకును సహాయము నిరాకరింప బడును. ఇది నా సృష్టిధర్మము. వినయముతో సృష్టిధర్మము నవలంబింపుము. ప్రకృతి నీకు సహకరించగలదు.

కనబడుచున్న ప్రకృతి అంతయు నా రూపమే! జీవులందరూ నా బిడ్డలే! నే నన్నిటి యందు ధర్మస్వరూపుడనై యున్నాను. ప్రకృతిని మన్నింపుము. ధర్మము నవలంబింపుము. జీవుల యందు మైత్రీ భావమును కలిగియుండుము. నీకు సర్వత్ర జయము కలుగును.

11

## నా కదలిక

నీ వెక్కడ నున్నను, ఏమి చేయుచున్నను నే నెరుగుదును. నేను ఈ సమస్తమును అధిష్ఠించి యున్నాను. హృదయస్థుడనై నే నందరి ప్రవర్తనములను, వర్తనములను గమనించుచునే యున్నాను.

వాస్తవమునకు నా ఉనికియే నీ కదలికకు కారణము. నాయందు సమస్తము కదలుచున్నది. నేను ఈ సమస్తము నందు నా ప్రకృతి ద్వారమున కదలుచున్నాను. నేను లేని నీవు లేవు. కదలిక లేదు.

12

# ధ్యానము

తృప్తి లేని మానవుని ధ్యానము ఒక భ్రమ.

తృప్తి యందు నిరంతరత్వము మాత్రము చేతనే నిజమైన ధ్యానము నందు మానవునికి స్థిరత్వము లభించును.

13

# సందర్శకుడు

నీ వద్దకు వచ్చు ప్రతి వ్యక్తి యందును నన్ను దర్శించుము. అది జంతువైన కావచ్చును. వారిలో "నన్ను" చూచుచు, వారిని ప్రేమతో, దయతో, కరుణతో ఆహ్వానించుము. నీకు సాధ్య మైనంతవరకు వారి యవసరములను తీర్చుము (అదియు నీకు సాధ్యమైనంత వరకే!). సాధ్యము కానిచో వారికి ఆదరపూర్వకముగా తెలియ జేయుము. ఎట్టి పరిస్థితులలోను నీ తలుపు తట్టిన వానిని అవమానింప వలదు.

14

# సద్గురువు

సత్యమునకు, ధర్మమునకు, సత్యధర్మ స్వరూపుడగు భగవంతునకు ప్రతీకయే సద్గురువు. సద్గురువు వాహికగ పరతత్త్వముతో పాటు సమస్త మును గ్రహింపవచ్చును. సద్గురువు నుండి ప్రకాశించునది పరతత్త్వమే. దేవతలు కూడ పరతత్త్వము నుండి భాసించినవారే కావున సద్గురువు నుండి కూడ భాసింతురు. కావున సద్గురువే సమస్తమునకు మార్గము.

15

# గుర్తింపు

సంఘమున గుర్తింపున కెదురు చూడకుము.

సంఘమున కీర్తికన్న దైవముయొక్క ఆశీర్వచనము, గుర్తింపు మిన్న.

ప్రపంచపు కీర్తిప్రతిష్ఠలు నురుగులోని నీరువలె మరుక్షణ మదృశ్యమగును.

దైవముయొక్క గుర్తింపు శాశ్వతము.

16

# కోరుట

నాయందు నీకు పూర్తి భక్తి విశ్వాసము లున్నచో గాఢముగ ప్రార్థించుము. నీ సమస్తమును నేనే రక్షణ చేయుదునని వాగ్దాన మిచ్చియున్నాను గాన నీవు ప్రత్యేకించి కోరనవసరము లేదు.

కోరుట వలన తీర్చుట, కోరకుండుట వలన తీర్చకపోవుట వుండదు. నన్నాశ్రయించిన వాని సమస్త భారమును నేనే భరింతును. ప్రత్యేకించి కోరుట భావ దారిద్ర్యమే.

17

# నాతో స్నేహము

నాతో స్నేహము వహించిన మనస్సు ప్రశాంతత నొందును. అట్టి మనస్సునకు కోపము, చిరాకు, భయము, ఆందోళన, అసూయ, ద్వేషము మరియు కామము వంటి ప్రకంపన లుండవు. అవి యున్నచో నీ మనస్సు నాతో స్నేహము వహించనట్లే.

18

# నా వేషములు

నేను ఎల్లప్పుడూ ప్రేమానురాగములు చిందించు ప్రశాంతుడనని భావింపకుడు. నేను అగ్నివలె మండుదును. ప్రళయమువలె భయపెట్టెదను. యమునివలె శిక్షింతును కూడ. నిన్ను ఉద్ధరించుకొనుటకు ఎన్ని రకముల వేషములనైనను ధరింతును.

19

## నా రూపము

రూపమున నీవు నన్ను గుర్తింపలేవు. ఏలయన నా రూపము లనేకములు. నన్ను గుర్తించుటకు నా సాన్నిధ్య మాధుర్యమే నిదర్శనము. అది రూపముతో సంబంధము లేక కూడ దొరకును. నా సాన్నిధ్యము నిత్యము, శాశ్వతము. నా రూపము తాత్కాలికము. నా రూపము ద్వారా నా సాన్నిధ్య మున కెదుగుము.

20

# నిజమైన భక్తి

నేను మశీదునందు ఉందును, కాని ముస్లిమును కాదు. నేను హోమము చేయుదును, అంత మాత్రముచేత హిందువును కాదు. హిందువునకు అల్లా, ముస్లిమునకు రాముడు అవగాహన అయిననాడు మాత్రమే నిజమైన భక్తి సిద్ధింపగలదు.

దైవమును నీ పరిమిత భావముతో బంధింపకుము. అట్లు చేసిన బంధనము నీకే మిగుల గలదు. దైవము శుద్ధ చైతన్యము గాని పరిమిత భావమునకు లొంగునది కాదు.

21

# మీకున్నవి - నాకు లేనివి

నేను మశీదు నందుంటాను.

అంత మాత్రమున ముస్లిమును కాను.

నేను సతతము ధుని (అగ్నిని)

రగుల్కొల్పియే వుంటాను.

అంత మాత్రమున హిందువును కాను.

హిందువుతో అల్లాని సంబోధిస్తాను.

ముస్లిముతో రాముని సంబోధిస్తాను.

నేను నిజానికి శుద్ధ చైతన్యమును.

రాముడైనా, అల్లా అయినా శుద్ధ చైతన్యమే.

విభేదములు మీకు కాని నాకు లేవు.

22

# నీవు - నేను

నిన్ను నీవు తెలుసుకోనిదే,
నన్ను నీవు తెలుసుకో లేవు.
నన్ను నేను తెలుసుకొనుట వలన
నిన్ను నేను పూర్తిగా తెలుసుకొని వున్నాను.
నీయందు నేను, నేనుగ వున్నాను.
నాయందు నీవుకూడ నేనుగనే వున్నావు.

23

# నా సాన్నిధ్యము

నా సాన్నిధ్యము, అస్వస్థుని స్వస్థుని చేయగలదు.

దుర్మార్గుని సన్మార్గుని చేయగలదు.

దుర్గమములను సుగమములు చేయగలదు.

గొప్పతనము నుండి మంచితనమునకు

దారి చూపగలదు.

చీకటి నుండి వెలుగునకు కొనిరాగలదు.

నిన్ను నీకు తెలుపగలదు.

24

# మబ్బు

జీవితమున సమస్యలు అనునవి ఆకాశమున నల్లని మేఘముల వంటివి. నల్లని మేఘములు నీలాకాశమును మరుగు పరచుచున్నవి కదా! అటులనే సమస్యలు నీ ప్రజ్ఞను మరుగు పరచుచున్నవి. నల్లని మబ్బులు ఆకసమున శాశ్వతములు కావుకదా!

అట్లే నీ సమస్యలున్నూ.

వర్షించగనే నల్లని మబ్బు అదృశ్యమై, నీలాకాశము కనపడును. అట్లే కర్మ క్షాళనమైనంతనే సమస్యలు కూడ అదృశ్యమగును.

నీవెప్పుడును నీలాకాశమే. మబ్బువు కావు.

25

# జాతికుక్క

నీ మనస్సు ఊరకుక్కవలె నీ శరీరమును గూర్చి, కుటుంబమును గూర్చి, ఆస్తిపాస్తులను గూర్చి, ఇతరులను గూర్చి తిరుగాడుచుండును.

జాతికుక్క కర్తవ్యమునం దప్రమత్తమైయుండి ఇతర సమయములలో తనయందు తాను విశ్రాంతి గొని యుండును. అట్లే నీ మనస్సును నియమించి నచో కర్తవ్యమునం దప్రమత్తుడవై యుండి ఇతర సమయములలో నీ యందున్న నాయందుండ గలవు. నీ మనస్సను కుక్కను జాతికుక్కగ మార్చుకొనుము.

26

## నా సంకేతములు

నీ స్వప్నమున నే నగుపడినచో, నీకది శుభ చిహ్నమే. నీవు షిరిడీని దర్శించుట కూడ అంతటితో సమానమైన శుభ చిహ్నము. ద్వారకామాయి యందలి ధుని నిన్ను పవిత్రుని చేయును. నా సమాధి నీవు కోరిన వరము లిచ్చును. గురుస్థానము నీకు ఉపదేశమిచ్చి నా సామ్రాజ్యమునకు, సాన్నిధ్యమునకు దారి చూపును.

27

# బ్రతుకుదారి

శ్రద్ధతో దానము చేయుట విమోచన మార్గము. కుతితో ప్రోగుచేసుకొనుట బంధ కారణము. సదా దానము చేయుచు విమోచన మార్గమున పయనించుము. జీవితాంతము ప్రోగు చేసుకొనుచు బద్ధుడవు కాకుము. భౌతికముగను, మానసికముగను నిన్ను నీవిట్లే బద్ధుని చేసుకొను చున్నావు.

సహాయ మర్థించు బలహీనుల రూపమున నేను నిన్నర్థించు చున్నాను. నేను బిచ్చమెత్తుట నిన్ను ఉద్ధరించుటకే. సహాయార్థి రూపమున నీ కడకు వచ్చు వానిని నిర్లక్ష్యము చేయకుము. వాని రూపమున నన్ను చూసి, సదవకాశముగ భావించి శ్రద్ధతో దానము చేయుము. బ్రతికి పోయెదవు!

28

## ఊది

వేద్యుడే* వైద్యుడు. వేద్యుని నుండి వైద్య తరంగములు ప్రసరించి రోగిని స్వస్థునిగ చేయును. వేద్యుడు ప్రత్యేకముగ వైద్యము చేయడు. అతడెచ్చట నున్నను అతని నుండి వైద్యము జరుగుచునే వుండును. వేద్యునకు మంత్రములతోను, తంత్రములతోను, ఓషధులతోను, పలురకములైన మందులతోను పనిలేదు. అతడు వైద్యమును నర్తింపడు. వేద్యుడుగనే యుండును. అతని స్పర్శ ప్రత్యక్షముగను పరోక్షముగను వైద్యము చేయగలదు. ద్వారకామాయి యందలి విభూది నా స్పర్శచే అట్టి పరోక్ష వైద్యమును గావించుచున్నది.

*వేద్యుడనగా ఆత్మజ్ఞాని.

29

# కూడలి

దేవతలు సహితము మానవ దేహమును చూసి ఈర్ష్య చెందుదురు. కారణమేమన మానవుడు నా పరిపూర్ణ సృష్టి. మరియు మానవ శరీర మొక్కటియే నన్ను తెలుసుకొనుటకు సరియైన పనిముట్టు. మరియొక శరీరమున నున్నప్పుడు నన్ను నీవు తెలుసుకొనలేవు. నీలోని పశువు మేల్కొనక ముందే నీవు మేల్కొని నన్ను తెలుసు కొను ప్రయత్నమును పూనుము.

నీవు మేల్కొనినపుడు నీకు రెండు ద్వారములు గలవు. ఒకటి పశుద్వారము, మరియొకటి పశుపతిని చేర్చు ద్వారము. ఏ ద్వారమున ప్రవేశించుటకైన నీకు సంపూర్ణ స్వాతంత్ర్యము నిచ్చితిని. నీకు నీవుగ నీ జీవితమును నిర్ణయించుకొన వచ్చును. నిన్ను నీవు ఉద్ధరించుకొన వచ్చును. మరియు అధోగతికి కూడ చేరుకొనవచ్చును.

30

## భాగవత సేవ

మహాత్ముల సాన్నిధ్యము బంధమోచన కారకము. ప్రార్థనలు, క్రతువులు, మంత్రములు, తంత్రములు, గ్రంథ పఠనములు, స్తోత్రములకన్న మహాత్ముని సాన్నిధ్యము మిన్న! అతని సేవయందు నీ మలినములు దగ్ధము కావింపబడును. నిన్ను నీవు నియమించుకొను శక్తి స్థిరపడును. మరియు నిన్ను నీవు తెలుసుకొను మార్గము దొరకును. మహాత్ములను కోరి సేవింపుము. అది నీకు సర్వవిధముల శుభము కలిగించును.

31

# వాహనము - ప్రయాణము

నీ శరీరమును నిర్లక్ష్యము చేయకుము. అది దివ్యమైనది. దేవునకు చెందినది.

అట్లని దానికి లోబడి జీవించకుము. తగుమాత్రము శ్రద్ధ వహించి పోషణము చేసినచో నీ సాధనకు ఉపయోగ పడగలదు.

నీ ప్రయాణము పూర్తియగు వరకు నీకు వాహనము కావలయును కదా! ప్రయాణమున వాహనమునకు మరమ్మత్తు వలసినచో ప్రయాణమాగును. గమ్యమును చేరలేవు.

ప్రయాణమున వాహనమును నీవు వదలరాదు. ప్రయాణము పూర్తియగు వెనుక వాహనమును పట్టుకొన రాదు. దారిలో వాహనము నిన్ను వదలినచో నీవు దురదృష్టవంతుడవు. గమ్యమును చేరిన వెనుక నీవు వాహనమును వదలుట అదృష్టము. నిన్ను నీవు తెలుసుకొను నంత వరకు నీ శరీరమను వాహనమును నీవు పదిల పరచుకొనుము.

32

# ఋషి

నా ప్రజ్ఞ దేశమును, కాలమును వ్యాపించి యున్నది. సృష్టి యందలి సమస్తజీవుల హృదయము లందును నే నున్నాను. సాక్షీభూతుడుగ నున్నాను. నాయందు జీవులందరూ తిరుగాడుచుండగ వారి యందు నేను తిరుగాడుచున్నాను. నా నుండి దిగివచ్చిన ప్రకృతి నుండి త్రిగుణము లుద్భవించి నవి. త్రిగుణముల నుండి జీవు లుద్భవించినారు. అనగా జీవులకు నేను ముత్తాతను. నాకు వారు మునిమనుమలు. మునిమనుమడు తాతను చేరుటకు మూడు పొరలను ఛేదించుకొనవలెను. అవి వరుసగా అహంకారము, త్రిగుణములు, ప్రకృతి (మాయ). ఇట్లు త్రిపురములను (మూడు పొరలను) జయించినవాడే నన్ను దర్శించగలడు, అతడే ఋషి. అనగా నన్ను చూచువాడు.

33

## అతిథి

నీ నివాసమున కేతెంచిన అతిథిని అశ్రద్ధ చేయకుము. అతడు నీ ఇంటికి వచ్చిన దైవమే! అతనికి అన్నపానీయములు, ఇతర సౌకర్యములు కల్పింపుము. అతిథికన్న నీవు ముందు తినకుము, ముందు నిద్రించకుము. శ్రద్ధ, భక్తి, ప్రేమ, వాత్సల్యము అతనియందు చూపుట నీ కర్తవ్యము. అదియే నిజమైన దైవారాధనము! గుర్తుంచు కొనుము.

అతిథిని అశ్రద్ధ చేసినవారికి, దైవమును అశ్రద్ధ చేసిన దుష్ఫలములు తగులుకొన గలవు. కష్టనష్టములు ఏర్పడ గలవు. అతిథి హృదయమున రంజించిన నీకు దైవముయొక్క ఆశీర్వచనము సూటిగ అందగలదు. నీవు సమృద్ధిని పొందగలవు.

34

# సంగమం

చలమతి చపలమతియే! చపలచిత్తము సమస్త విషయముల యందును క్షణము తీరికలేక చిందుచుండును. చిత్తమును గంగా – యమునల సంగమమునందు మునక వేయించి, అంతర్వాహిని యైన సరస్వతిని దర్శించుము. అట్టి సరస్వతీ స్నానమే సమస్త భ్రమలనుండి నిన్ను తరింప చేయగలదు.

( గంగా – యమునలు అనగా ఇడ – పింగళ ప్రవాహములు. సరస్వతి అనగా అంతర్వాహినియగు నాదము, సుషుమ్న. హృదయము, భ్రూమధ్యమునందు జరుగు సంగమమునందు చిత్తము నిలుపుట అభ్యాసము. ఇదియే తారణమునకు ఉపాయము. )

35

# షట్ సూత్రములు

* ఆత్మ విచారము చేయుము.
* పవిత్ర గ్రంథములను అధ్యయనము చేయవలయును.
* తల్లితండ్రులను సేవించుట మరువకుము.
* నీ చుట్టునుగల జీవులకు హితము నొనర్చుచుండుము.
* అతిథిని అశ్రద్ధ చేయకుము.
* దైవ ప్రార్థనను శ్రద్ధాభక్తులతో నిర్వర్తించుము.

పై సూత్రములను శ్రద్ధతో పాటించువానికి నా అనుగ్రహము పరిపూర్ణముగ లభించగలదు. మరియొక మార్గము లేదు.

36

# భవిష్యత్ వాణి

“సాయిబాబా సాన్నిధ్యము వలన షిరిడి గ్రామము ఒక పుణ్యక్షేత్రము కాగలదు. బాబా మానవు లనెడి రాళ్ళగుట్టలో వజ్రము వంటి మహాత్ముడు. అతని నిరాడంబరత్వము భ్రమను గొలుపు ముసుగు. అహంకారులను దూరముగ నుంచు ఒక ప్రక్రియ. తన సాన్నిధ్యము మాత్రము చేత జీవులను, ప్రదేశములను, బాబా పవిత్రీక రించగలడు. ఈతని పరిపూర్ణత్వమును భవిష్యత్తు ఆవిష్కరింపనున్నది. ప్రస్తుతమునకు అతడొక ఫకీరు మాత్రమే!”

– నానావళి

37

# తోటపని

తోటపని ఒక పవిత్ర యజ్ఞము. మనస్సున మృదుత్వ మేర్పడవలెనన్నను, కాఠిన్యము కరగవలెనన్నను మొక్కలు పెంచుట ఒక చక్కని ఉపాయము. పూలమొక్కలు, కూరల మొక్కలు, పండ్ల మొక్కలు శ్రద్ధతో పెంచువానికవి సున్నితత్వమును అందించగలవు. ఎంత సుకుమారముగ పెంచగలిగినచో, అంత సౌకుమార్యము మనసున ఆవిష్కరింపబడగలదు. చిగురించిన పుష్పములు, పెరిగిన పండ్లు నీయందు కూడ అట్టి ఫలితములను ఆవిష్కరింప గలవు. మొక్కలు చక్కగ పెంచలేనివాడు జీవితమున దేనిని సున్నితముగ పెంచలేడు. జీవితమనెడి తోటను పెంపొందించు కొనుటకు తోటను పెంచుట ఒక చక్కని సాధన. నీ జీవితము అడవివలె నిష్ప్రయోజనముగ పెంచుకొనక తోటవలె పండించుకొనుము. ప్రతినిత్యము నేనందులకే తోటపని చేయుచున్నాను.

38

# తపన

సోమరితనమును, అశ్రద్ధను దరి జేర నీయకుము. అవి నీ మరణమునకు దారి చూపునవి. తప్పిపోయిన తనయుని తండ్రి అవిశ్రాంతముగ వెదకును. భార్యను పోగొట్టు కున్న భర్త, భార్యకై విలపించును. గుప్తధనము కొరకు ధనకామి పరితపించును, అన్వేషించును.

నీవును అట్లే అవిశ్రాంతముగ, ఆర్ద్రతతో అనునిత్యము ఆత్మాన్వేషణమును గావించి మరణమును దాటుము. ఇట్టి తపనే తపస్సు.

39

# బిచ్చము - ముష్టి

బిచ్చమెత్తుట ప్రాథమిక హక్కుకాదు. దానికి అర్హత యుండవలెను. కుటుంబము లేనివాడు, ఆస్తిపాస్తులు లేనివాడు, ధనము నాశించని వాడు, కీర్తికాంక్ష లేనివాడు, వంటరివాడు మాత్రమే బిచ్చ మెత్తుటకు అర్హుడు. అట్టి బిచ్చగాడు బిచ్చమెత్తుట ద్వారా బిచ్చము నిచ్చువారి పరిమితులను క్రమశః నిర్మూలించగలడు.

ఇతరుల శ్రేయస్సుకై బిచ్చ మెత్తువాడు మాత్రమే నిజమైన బిచ్చగాడు. తన కొరకై బిచ్చ మెత్తువాడు ముష్టివాడు. అట్టి ముష్టివారు సంసారులయందు, ఆస్తిపరులయందు, ధనికుల యందు ఎందరో కలరు. నేను బిచ్చమెత్తుట మీ శ్రేయస్సు కొరకే. మీ కది తరణోపాయము. మీ తరణోపాయమే నా తరణోపాయము.

40

# ప్రసాద వితరణము

నాకు ప్రసాదమును పెట్టుట మీరు తెలుసుకొన లేకున్నారు. అన్ని జీవుల ఆకలి కడుపులు నావే. వారిని నిరాకరించి నాకు ప్రసాదమును తెచ్చువారు డంబాచారులు. వారి ప్రసాదమును నేను ముమ్మాటికి స్వీకరించను.

నాకు అపరిమితమైన రూపములు గలవు. శ్రద్ధతో నన్ను స్మరించి ఆకలిగొన్న ఏ జీవికియైనను ఆహార మందించినచో అది నాకు చేరగలదు. నేను శ్రద్ధ, స్మరణ కారణముగ మీ ప్రసాదమును సూటిగ అందుకొనగలను. నన్ను స్మరించి శ్రద్ధతో కుక్కకు పెట్టుము, అది నాకందును. ఎద్దుకు పెట్టుము, నాకందును. పేదకు పెట్టుము, నాకందగలదు. నన్ను స్మరించుచు మొక్కకు నీరు పోయుము, నా దప్పిక తీరగలదు. నీ మనస్సున నన్ను గూర్చి నీవేర్పరచుకొన్న పరిమిత రూపమును దాటనిచో నీవు మూఢుడవై యుందువు. అన్ని రూపముల నుండి నేను ప్రతిస్పందించు చుండ నీవా రూపముల నెట్లు నిరాక రించగలవు. నీ పరిసర రూపములన్నియు నావే. కావున వానిని నన్నుగ స్మరించి సేవింపుము.

41

# నా సలహా

జాతి, కుల, మత, వర్గ భేదములయందు జీవించు వారు మూఢులు మరియు అజ్ఞానులు. సమస్తమునందు గల అంతర్హిత సత్యమును తెలిసినవాడు జ్ఞాని. సత్యము నందు సర్వ మతములు సమ్మతమై నిలచును. మత మేదైనను త్రికరణశుద్ధిగ సత్యము ననుసరించుము. సత్యమార్గముననే నీవు నన్ను చేరగలవు. మరియొక మార్గము లేదు. యాంత్రి కములగు ఆరాధన వలన ఉపయోగ మేమియును లేదు. ఈ భావమునందు, భాష యందు, చేత యందు సత్యమునే ప్రతిపాదించుము. జీవుల యందు మైత్రి, కరుణ కలిగి యుండుము. వాద ప్రతివాదములు, ఘర్షణములు నిన్ను ఉద్ధరించలేవు. ఇతరులతో పోటీపడుట నీ కనారోగ్య కారకము. నిర్మలముగ నీ కర్తవ్యమునందు నన్ను దర్శించుచు, నిర్వర్తించుకొనుచు నన్ను చేరుము. ఫలితములపై ఆశను కూడ నాకు సమర్పించుము. ఇది నా సలహా.

42

# దివ్యశక్తులు

నిర్మలత్వము, నిగూఢత్వము మహాత్ముల సహజ లక్షణములు. వారి భాషణము కాని, హావ భావములుకాని ప్రశాంతతను ప్రసరింపజేయునే గాని ఆడంబరమును ఆవిష్కరింపవు. మహాత్మునకు వ్యక్తిగతముగ తన గురించి తెలియజేయు స్వభావ ముండదు. వారికి తమయందు తాముండక దైవమే నిండియుండును. దైవమే ప్రకటింపబడుచుండును. వారు చక్రవర్తివలె గంభీరముగ జన సామాన్య మున తిరుగాడు చుందురు. దివ్యశక్తులు వారి కనుసన్నల ఆజ్ఞలను నిర్వర్తించు చుండును.

43

# నిజమైన స్నేహితులు

సత్యమే శివము. అనగా శుభమని అర్థము. సత్యయుక్త మైన శుభమే నిజముగ సుందరము. సత్యయుక్తమైన శుభము అవతరించినచో అత్యంత సుందరముగ నుండును. రామకృష్ణు లట్టివారు. అంతటి సుందరమయమైన అవతారములు ఇప్పటికిని కూడ మరల రాలేదు. వారి జీవన విధానమే మనకు రామ చరితము (రామాయణము) మరియు కృష్ణ చరితము (భాగవతము) గ అందివ్వబడినవి. ఈ గ్రంథముల యందు సత్యము యొక్క సాన్నిధ్యము శుభముగ, సుందరముగ దొరకును.

నీవు శుభము, సుందరము అయిన దైవమును పొంద గోరుచున్నావా? అట్లయినచో రామాయణ, భాగవతములను శ్రద్ధతో పఠించుట మరువకుము. వాని మహాత్మ్యము నిన్ను మహాత్మునిగ మలచ గలదు. వాని పారాయణము నీకు "సాధన" యను బరువైన భావమును నిర్మూలించి సూటిగ దైవసిద్ధిని కలిగించును. మన పవిత్ర గ్రంథములకన్న మించిన సన్నిహిత మిత్రులు ముమ్మాటికీ లేరు.

44

# ఋషి చూపు

తల్లి పిల్లను నిరసించదు. నదీసంగమమును సాగరము నిరాకరించదు. ఉపాధ్యాయుడు విద్యార్థిని నిర్లక్ష్యము చేయడు. గొడ్లకాపరి ఏ గొడ్డును మరువడు. నేనును అట్లే ఎవరిని నిరసించను, నిరాకరించను, నిర్లక్ష్యము చేయను, మరువను. నన్ను చూచువారి నందరిని నేను చూచుచునే యున్నాను. నన్ను చూచువారికి మాత్రమే, నేను చూచుచున్నానని తెలియును. ఇతరుల కెట్లు తెలియగలదు? నేను చూచుట లేదేమో యని అనుమాన పడుచున్నవాడు నన్ను అనుమానముతో చూచుచున్నాడు. నేను చూడలేను యని అహంక రించువాడు, నన్ను చూచుట లేదు. నన్నేదృష్టితో చూచిన, నేనా దృష్టితోనే చూతును. మరియొక మార్గము నాకు లేదు. మీకును లేదు.

45

# నామ స్మరణము

నా నామము నిరంతరము ఎవరి నాలుకపై నుండునో వారదృష్టవంతులు. నన్నెవరు తలచినను తక్షణమే నేను పలికెదను. కోరిన సహాయము చేసెదను. కోరినచో కర్మబంధ విమోచనము కూడ చేయగలను. నిరంతర నామ స్మరణమే నే నందించు దీక్ష !

46

# దక్షిణ

వట్టి చేతులతో నా వద్దకు నీవు ఎప్పుడును రావలదు. ఇచ్చుట తెలియనివానికి పొందుట కుదరదు. ఇచ్చునది అతి స్వల్పమైనను నీకున్న భక్తివలన అది స్వీకరింపబడును. దానగుణము మూడు లోకములయందు కూడ శ్రేష్ఠము. దానము వలన హృదయము దయతో నిండును. అది కారణముగ హృదయము విప్పారును. భక్తితో కూడిన దానము వలన దాక్షిణ్యము పెరిగి వైరాగ్య మబ్బును. అది కారణముగ మనసు పవిత్రత చెందును. దానము, దక్షిణ ఇచ్చుచున్నకొలది నీవు పవిత్రుడ వగుదువు. పెరుగుదువు. పుచ్చుకొన్నకొలది తరుగుదువు.

నే నెవరిని అనుగ్రహించ దలచెదనో వారినుండి మాత్రమే దక్షిణ స్వీకరింతును. దక్షిణ ఇచ్చువాని ఉద్దేశ్యమును బట్టి వారి ననుగ్రహింతును. మీరు కోరినది కాక మీకు వలసినది అందింతును.

47

# సాధన - సిద్ధి

ఆర్తితో ఎవరు అర్థించినను వారిని నే నాదుకొందును. అర్థించినవారి వెంట నుందును. మీ హృదయమే నా నివాసము. మీ హృదయమున ఉండి మిమ్ములను చక్కబెట్టగలను. నన్ను చూడదలచినచో హృదయముతో ప్రవర్తింపుడు. ఎవరి హృదయము నందైనను నేను కనపడగలను. అట్లు చూచు ప్రయత్నము సాధన. చూచుట సిద్ధి.

48

# పంచ ద్వారములు

మీ పంచ ద్వారములను తెరిపించుటకు, మీయందు నన్ను దర్శించుటకు, మీ నుండి నేను ఐదు నాణెములు కోరుచున్నాను. అవి ఏమనగా :

1. ఐదు ఇంద్రియములు
2. మనస్సు
3. బుద్ధి
4. శ్వాస
5. మిమ్ములను గూర్చిన మీ అభిప్రాయము.

పై నాణెములు నాకు సమర్పింపుడు. నన్ను మీయందు దర్శించుడు.

49

# నవ గుణ భక్తి

నావారై చరించువారు ఈ క్రింది తొమ్మిది గుణములను అభ్యసింపవలెను.

1. నా కొరకై ఆర్తి– అనగా మననము, ధ్యాస, ధ్యానము.
2. నిత్యానిత్య వస్తు వివేకము.
3. అంతర్ముఖ దర్శనమునకై ప్రయత్నము.
4. ఆలోచనలయందు పవిత్రత.
5. మాట మంచితనము మరియు చేతలయందు మంచితనము.
6. గొప్పతనమునకై ప్రాకులాడకుండుట.
7. నీయందలి శ్వాసను, స్పందనమును గమనించుట. అవి నేనే!
8. నిరంతరము ప్రవర్తనయందు మెరుగుదలకై కృషి సలుపుట. అందులకై సద్గ్రంథ పఠనము, సత్పురుష దర్శనము, సత్కర్మాచరణము ప్రతి దినము చేయవలెను.
9. దైవ భక్తులను గౌరవించుట, వారి మాటలను శ్రద్ధతో ఆలకించుట, వారిని ఎగతాళి చేయకుండుట.

50

# సుడిగుండము

డబ్బునకు, సంపదకు ఆశపడువాడు, కుటుంబము యందు మోహము కలవాడు, కీర్తి ప్రతిష్ఠలయందు చిక్కుకొనువాడు– సుడిగుండములో పడినవానితో సమానము. అతడికి అధోగతి తప్పదు. తెలిసిన మంచి విషయములు పై గుణములుకల వానిని రక్షింపవు. అతడు మాయచే మోసగింప బడినవాడు. భోగానురక్తి, దైవానురక్తి దక్షిణ ఉత్తర ధృవముల వంటివి. భోగానురక్తత సుడిగుండము కాగ, దైవానురక్తి కైవల్యప్రదము.

51

# ధ్యానము – తృప్తి

జీవితమున తృప్తి లేనివానికి ధ్యానము గాలిని మూటకట్టుట వంటిది. తృప్తి లేనిదే సంతోషము లేదు. సంతోషము లేనిదే సుఖము లేదు. మనసున సుఖము లేనిదే స్థిరముండదు. స్థిరమతి కాని వాని ధ్యానము శ్రమయే కాని పరిశ్రమ కాజాలవు. తృప్తిపడుము. దాని వలన సంతోషము, సుఖము, స్థిరము అగు మనస్సు కలుగును. అట్టి మనస్సుతో ధ్యానించుము.

52

## హెచ్చరిక

ఫలితములపై ఆసక్తి కలవారికి, భోగాసక్తులకు, గర్వము గలవారికి సద్గురు బోధలు చెవిన పడినను మరల గాలిలో కలయునే గాని ఏ మాత్రము ఉపకరించవు. అట్టి వారికి చేయు బోధలు నిష్ఫలములు.

53

# నా కోశాగారము

నా కోశాగారమున సమస్తమును లభించగలదు. నేను సర్వ సమర్థుడను. దేనినైనను ఈయగలను. నీకే అడుగుటకు శక్తి లేదు. ఇచ్చి నను అరిగించు కొనలేవు. అజీర్తితో బాధ పడుదువు. నీకు అజీర్తి, రోగము, పతనము కలుగకుండనివే నీకిత్తును గాని నీవు కోరినదెల్ల ఇవ్వను. వలసినదే కోరుట నేర్చుకొనుము. కావలసినదెల్ల వలసినది కాదని తెలుసుకొనుము.

54

# దివ్య ప్రణాళిక

నే నెవరిని పరిపూర్ణముగ అనుగ్రహింతునో అతడు నా ప్రణాళికకు బద్ధుడై జీవించును. నా ప్రణాళిక యనగ దివ్య ప్రణాళికయే.

నా ప్రణాళిక యందు బద్ధుడైనవాని జీవనమున బాధ్యతయే యుండును గాని హక్కులుండవు.

55

# ఫలశ్రుతి

ఆత్మ దర్శనమైనచో మహత్తరమగు శక్తి నీ నుండి వెలువడును. అది కారణముగ నీ పరిసరము లంతయు చక్కని పరివర్తనము చెందును. నీ పరివారము యొక్క జీవము పొంగును. నీ పరిసర ములు సమస్తము నీ కాకర్షింపబడును. నీ నుండి వానికి ఆత్మ చైతన్యము ప్రసరించును. వారును కూడ క్రమశః దైవీ స్వభావము లోనికి ఉద్ధరింప బడుదురు. ఇదియే ఆత్మ దర్శనమునకు ఫలశ్రుతి.

56

# నా బోధనలు

సద్గురు బోధలయందు రహస్య బోధన ముండదు. బోధన అందరికిని ఒకటియే, అది బాహాటమే. ప్రత్యేకముగ చెవిలో నూదుట యుండదు. బోధన లందరికీ చేసినను ఆ బోధన లను వలసినవారే అందుకొందురు. ఇతరులు మరతురు. కొందరికి ప్రత్యేక బోధలు చేయుట, రహస్యముగ చెవిలో నూదుట నా మార్గమున లేదు. అందరూ నావారే. నేను మీ వాడనని మీరు తలచుటయే ఆలస్యము. మీ తలపును పట్టియే నా బోధలు ఫలించును.

కొందరికి నా బోధలు ఆత్మదర్శన కారక ములు, కొందరికి భోగకారకములు, మరికొందరికి వ్యాపార కారకములు, ఇంకొందరికి తికమక కలిగించగలవు. ఈ వివిధత్వము మీ యందున్నది, నా యందు లేదు.

57

# హృదయగతములు - మనోగతములు

సద్గురువు నీలమేఘమువంటి వాడు. నీలమేఘము చల్లదనము నిచ్చుటయేగాక వర్షించును కూడ. సద్గురు సాన్నిధ్యము చల్లదన మిచ్చును. సద్గురుని బోధలు అమృతమును కురిపించును. అతని బోధలు ఒకే అంశమును వైవిధ్యముతో ఆవిష్కరించు చుండును. సద్గురువు వాక్కు హృదయమున స్వీకరించి, లోన పదిలము చేసుకొని, ఆచరణ రూపమున వ్యక్తము కావలెను. బోధనలట్లు హృదయము నుండి మనసున కెక్కును. అప్పుడా మనస్సు వాక్కు, ఆచరణల రూపమున పరిమళములు వెదజల్లును.

హృదయము నుండి మనసుకి చేరిన బోధనలే వక్రత చెందక వ్యక్తము కాగలవు. అట్టి శిష్యుడే గురువుకు వాహిక. కేవలము మస్తిష్కమున కెక్కించినవాడు బోధనలను ఆచరింపక మాటాడుటచే గురుబోధనలను వక్రీకరించును. బోధనలు హృదయ వికాసమునకే. హృదయము నుండి మనసు కేర్పడు ప్రేరణ వలన మనసు కూడ వికసించును. హృదయగతునకు మెలకువ నందు, స్వప్నమునందు మరియు నిద్రయందు సద్గురు బోధనలు అందుచునే యుండును.

58

# నా తిప్పలు

వ్యాధి నిరోధనమున కుపయోగించు ఔషధము అవసర మునుబట్టి చేదుగా కూడ నుండును. వైద్యుడు రోగి ఇష్టాను సారము వైద్యము చేయడు. రోగి కవసరమగు వైద్యము చేయును.

సద్గురువు శిష్యుని కోర్కెలకు, ఇష్టములకు ప్రతిస్పం దించడు. అతనికి శ్రేయస్సు కలుగునవియే అనుగ్రహించును. అవసర మగునపుడు కఠినముగ కూడ నుండును. సద్గురు కఠినత్వము వెనుక ప్రేమ దాగియుండును. అతడు కొందరిని ప్రోత్సహించును. కొందరిని ప్రోత్సహించకుండును. మరి కొందరిని నిరుత్సాహపరచును. ఇంకొందరిని చీవాట్లు పెట్టును. కొంతమందిని నలుగురిలో అవహేళన చేయును.

నా చేత లన్నియు మీకట్లే గోచరించును. మీలోని కరుడు గట్టిన దృక్పథములను ధ్వంసముచేసి మీకు పరిణతి కలుగుటకు రకరకముల వేషములు వేయుదును. మీకు నే నవగతము కాను. కాని మీ శ్రేయస్సుకే అహర్నిశలు తిప్పలు పడు చుందును. ఇందుకు కారణము మీయందు గల ప్రేమయే. ఈ తిప్పలు పరమప్రేమకు సంబంధించినవి. మీ కొరకే నా తిప్పలు.

59

## మా దాపరికము

సద్గురువు తనను తా నమ్ముకొనడు. తనను గూర్చి స్తుతి చేసుకొనడు. తనకున్న జ్ఞానమును, శక్తులను బాహాటముగ ప్రదర్శింపడు. మోక్షము నిత్తునని, ఆత్మజ్ఞానము నుపదేశింతునని బీరము లాడడు.

అతడందరిలో నొకనివలె నుండును గాని వేషధారణ యందు ప్రత్యేకతను కలిగియుండడు. అతని దినచర్య అతి సామాన్యముగ నుండును. మాటయందు గాని, చేతయందు గాని, వేషభాషలయందుగాని ప్రదర్శనబుద్ధి యుండదు. అతని చుట్టును వాతావరణమున సహజమగు ప్రశాంతత యుండును. ఉద్వేగము, ఆవేశము ఉండదు.

సద్గురువు ఎట్టి ఆశలను కలిగించడు. తన పరివారమును ఉద్వేగపరచక కర్తవ్యోన్ముఖులను చేయును. అతని ప్రవర్తనమున అతి విలువైన విషయములు మరుగుగ నుండును గాని బాహాట ముగ పరుచుకొని యుండవు.

మీరు విలువైన వస్తువులు, బంగారము, వజ్రములు, ధనము దాచుకొని యుంచినట్లే సద్గురువు తన దివ్యత్వమును దాచియుంచును. అవసరమును బట్టి వినియోగించును. మా దాపరికము లిట్టివే.

60

# అనుసరణము

సద్గురువు చరిత్ర శ్రద్ధతో పఠింపుడు. సద్గురు సాన్నిధ్యము వీలున్నంతమేర పొందుడు. అది భౌతికము కావచ్చును, మానసికము కావచ్చును లేక ఆచరణాత్మకము కావచ్చును.

సద్గురువు చేయు కార్యములను శ్రద్ధతో గమనింపుడు. అతని బోధనలను శ్రద్ధతో ఆలకింపుడు. అతని నిర్దేశములను ఆచరణము నందుంచుడు. అతడందించిన పనిని నిర్మలముగ, నిర్విరామముగ ఒనర్చుడు. ఈ విధముగ సద్గురువుతో జన్మ జన్మల సంబంధము నేర్పరుచుకొన వచ్చును.

సత్యమే రూపము కట్టుకొని వచ్చినపుడు సద్గురువుగ భాసించును. అతని ప్రవర్తన మీకెప్పటికిని అవగతము కాదు. ఓర్పు, శ్రద్ధ, మౌనము, అచంచలమైన ఆత్మవిశ్వాసము కలవారే సద్గురువు ననుసరించవలెను. ఇతరులకు సాధ్యము కాదు.

61

# తిరుగు ప్రయాణము

దైవమును మరచుట జీవులకు సహజము. ఈ మరపు సృష్టి ప్రణాళికలో భాగమే. దైవమును మరల స్మరించుట జీవులకు కాలక్రమమున జరుగును. ఇదియును సృష్టి ప్రణాళికలో భాగమే.

అనివార్యమైన వ్యాధులు కలిగినపుడు, ఆపదలు ముంచుకొని వచ్చినపుడు, భోగముల పరిమితత్త్వము తెలిసినపుడు, జీవులలో అన్వేషణ మొదలిడినపుడు, జీవులు దైవము వైపునకు తిరుగు ప్రయాణము చేయుదురు. అప్పుడే నిజమైన అన్వేషణము ప్రారంభ మగును. అట్టివారికే సద్గురువు మార్గదర్శి.

62

# దర్శనము - ప్రదర్శనము

సముద్రపు లోతులలోనే విలువైన మణులు, ముత్యములు దొరకును. భూగర్భములోనే వజ్రములు, వెండి, బంగారము దొరకును. నిర్మలమగు నీరు గూడ భూమి లోతులలో పారు చుండును. లోతులలో దొరికిన విలువైన సంపదలు ఒడ్డున దొరకవు సుమా! అని ప్రకృతి తెలుపుచున్నది. బాహ్య ప్రపంచ మంతయు లోతులేనిది. అందలి సన్నివేశములు, సంభాషణ ములు అన్నియు వచ్చి పోవునవియే. అవి తాత్కాలికములు. ఆనందము అందించినట్లు మురిపించునే గాని అట్టి ఆనందమునకు గూడ లోతు యుండును. బాహ్య ప్రపంచపు ఆడంబరమంతయు లోతులేని నీటియందలి ఈతవంటిది.

శాశ్వత సత్యములు, ధర్మములు, లోతైన మరియు ఎడతెరపిలేని అనుభూతి, ప్రశాంతత కోరు జీవుడు అంతర్ముఖుడగుట ఒకటియే మార్గము. అంతర్ముఖుడై లోలోపల జొచ్చిన కొలది సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ బడయగలడు. లోతులకు చొచ్చినకొలది ప్రజ్ఞ స్థిరత్వము చెందును. జీవిత సన్నివేశములు అతనిని కలత పెట్టవు.

దుర్ఘటనలు, తుఫానులు వంటి సన్నివేశములు అతనిని తాకలేవు. లోతులలో జీవించుట నిజమైన తెలివి. బాహ్య ప్రదర్శనలు పసితనము. మొదటిది దర్శనాత్మకము. రెండవది కేవలము ప్రదర్శనాత్మకమే, అనగా డంబాచారమే.

63

# మూడు రహస్యములు

సద్గురు బోధనలు అతనివలెనే సనాతనము. ఆ బోధనలు సత్యమునకు దారిచూపును. కావున సద్గురువును చేరుటకు అతని బోధనలే మార్గముగ నేర్పడును. సద్గురువు సత్యమే. అతడు రూపు ధరించిన సత్యము. సద్గురువును చేరుట యన్నను, సత్యమును చేరుటయన్నను నిజమున కొకటియే. రెండింటికిని మార్గము బోధనల నాచరించుటయే. ఇది ఒక రహస్యము.

బోధనల ననుసరించిన సద్గురువును చేరెదవు. సద్గురువు ననుసరించిన బోధనలు కూడ ఆచరించుట జరుగును. అనుకరణ అనుసరణకు దారి చూపును. చివరికి సత్యమునే చేరెదవు. ఇది మరియొక రహస్యము.

సత్యమును చేరిన, సద్గురువును చేరుట యుండును. సద్గురువును చేరిన, సత్యమును చేరుట యుండును. సత్యము తత్త్వమైనచో సద్గురువు దాని రూపము. వారు స్థితి భేదముచే రెండుగాని, నిజమున కొకటే. ఇది అంతిమ రహస్యము.

64

# చక్రభ్రమణము

జననము మరణమునకు దారితీయును. మరణము జననమునకు దారితీయును. ఇట్లు ఒకదాని వెంట ఒకటి చక్రగతిని అనుసరించును.

రాత్రి పగలుకు దారితీయును. పగలు రాత్రికి దారి తీయును. ఇట్లు అహోరాత్రములు చక్రగతి ననుసరించు చుండును.

నీవు భూమినుండి అంతరిక్షమున కేగినచో నీకు పగలు, రాత్రి యుండవు. భూచక్రము దాటిన వానికి పగలు లేదు, రాత్రి లేదు, దినములు కూడ లేవు. ఒకటే వెలుగుండును.

అట్లే పంచభూతాత్మకమైన దేహము నుండి నీవు ఊర్ధ్వగతి చెందినచో నీకు జనన మరణములను చక్రగతి లేదు. భూమిపై నుండియే దీనిని సాధించవచ్చును. అదియే యోగవిద్య. ఈ విద్య ననుసరించి దేహాత్మ భావమును వీడినచో చక్రగతి తప్పును. భ్రమ, భ్రాంతి, మాయ తొలగును.

65

# నీవు నేనే

సత్య మొక్కటే. దానిని గూర్చిన వ్యాఖ్యలు మెండు. కాలమును బట్టి, దేశమును బట్టి బహు భాషలలో అది వ్యక్త మగుచుండును. వ్యాఖ్యలు, సిద్ధాంతములు మిగిలిపోవును. సత్యము మరుగున పడును. నిజముగ నీవు సత్యమే. నిన్ను గూర్చి నీవు మరియొకటి అనుకొనుచున్నావు. నీవనుకొన్న దెల్ల నీవు కాదు. నీ ప్రతిబింబములను నీవు నీవిగా భావించుచున్నావు. నీవు అనిర్వచనీయుడవు. నిర్వ చించుకొనుటచే సత్యదూరుడ వగుచున్నావు. నిజముగ నీవు నేను!

66

# నీ స్వరూపము

మానవుడు భావములలం దుండును. మహాత్ములు చైతన్యమునం దుందురు. భావము కాలమును, దేశమును బట్టి చైతన్యమునుండి ఏర్పడు తరంగములు. తరంగము తాత్కాలికము. భ్రమ గొల్పునవి. చైతన్యము శాశ్వతమైనది. నిశ్చలము, అపరిమితము అయినవి. నీవు సహజ ముగ చైతన్యవంతుడవు. భావ పరంపరలకు గురియగు చున్నావు. నీవు భావములకు అతీతముగ నున్నావు. అట్టి వానిగా నిన్ను నీవు గుర్తింపుము.

67

# మాహాత్మ్యములు

నేను చేయు మాహాత్మ్యములు పిల్లలకు మిఠాయి పంచుట వంటిది. సత్యము, ధర్మముల యందు రుచి కలుగుట కట్లుచేయుదును. నా బోధనలు ధర్మమును దర్శింపజేసి సత్యమునకు దారి చూపును. రుచి తెలిసినవారు ధర్మము నాచరించుటయే కాని మరల మరల మాహాత్మ్య మను మిఠాయిని కోరరాదు. మాటి మాటికిని మిఠాయి కోరుట పసితనము. రుచి నెరిగినవారు మార్గమున నడచుట మగతనము.

68

# మీ నిర్వచనములు

నన్ను నీవు నిర్వచించుటకు ప్రయత్నింపకుము. నేను అనిర్వచనీయుడను. నీకు నిర్వచించుకొనినచో అది నీ నిర్వచనమే కాని నేను కాదు. నిర్వచనము నీకే పరిమితము. దానిచే నీవే పరిమితుడ వగుదువు. నీ పరిమితత్త్వమును నాపై రుద్దకుము. అడ్డచువ్వల కిటికీ నుండి ఆకాశమును చూచినచో ఆకాశము నకు అడ్డగీత లున్నవని అనిపించును. నిలువు చువ్వల కిటికీ నుండి చూచినచో ఆకాశమున నిలువుగీత లున్నవనిపించును. నన్ను గూర్చి మీ నిర్వచనము లన్నియు అట్టివే. నేను హిందువును అనుకున్నవారికి హిందువును. నేను మహమ్మదీయు డను అనుకున్నవారికి మహమ్మదీయుడను. నేను మనిషిని అనుకున్నవారికి మనిషిని. దైవము అనుకున్నవారికి దైవమును. నిజమునకు నేను నేనే! నిర్వచనములు మీవే!

69

# పురోగమనము

జీవితమున అనారోగ్యము, కష్టనష్టములు, కుటుంబ సమస్యలు, సంఘమున అప్రదష్ట మిమ్ము లను నావద్దకు చేర్చుటకు నిమిత్త కారణములు. అవి కలుగకున్నచో మీరు మరింత అహంకరించి అదుపు తప్పి పతనము చెందుదురు. పై సమస్యల కారణముగ ఆత్మావలోకనమునకు అవకాశ మేర్పడును. సత్పురుషులతో సమాగమమునకు యోచన కలుగును. పరివర్తనమునకు మార్గ మేర్పడును. సద్గురువు లభించినచో నీకు శాశ్వత పరిష్కారము లభించినట్లే. జీవనమునకు దారి ఏర్పడినట్లే. నిశ్చల మనస్కుడవై ముందుకు సాగుటయే, అటుపై నీ విధి.

70

# అధ్యయనము

దేహమునకు భోజనమెట్లో మనస్సునకు అధ్యయనమట్లు. సద్గ్రంథములను నిత్యము పఠించుచు నుండవలెను. తెలుసుకొనుచు నుండ వలెను. పఠించితిని, తెలుసుకొంటిని అనువాడు డాంబికుడు. నిజముగ తెలిసినవాడు తెలియునని తెలుపక ప్రవర్తనమున చూపును.

అధ్యయనము జీవితాంతము కొనసాగవలెను. జీవితాంతము భుజించుట లేదా? అట్లే అధ్యయనము గూడ. ప్రతిదినము శ్రద్ధాభక్తులతో కనీసము ఒక పేజీయైనను పఠింపవలెను. అప్పుడు మనసు పరిశుభ్ర మగును. పరిశుభ్రమైన మనసుపై బుద్ధి ప్రకాశించును. ప్రకాశించిన మనస్సు కర్తవ్యమును అప్రమత్తతతో నిర్వర్తించును. దారి సుగమ మగును.

71

## ఉపదేశము

సద్గురు ననుసరించుట నీవంతు. సద్గురునకు నీ వనుసరించినను, అనుసరించకున్నను తేడా పడదు. నీవు ఓర్పుతో, నిశ్చలమగు మనస్సుతో అనుసరించు టయే యోగ్యము. సద్గురువు చేయు పనులు, చెప్పు మాటలు అపుడపుడు అవగాహన కావు. మరియు సందేహాత్మకముగ నుండవచ్చును. సందేహపడుట వలన నీ స్థిరత్వము చెడును. అతని నుండి ఏమేమియో పొందుటకు ఆశ పొందకుము. ఆశ కలిగినచోట ఓర్పు నశించును.

ఓర్పుతో, నిశ్చల మనస్సుతో దీర్ఘకాలము సద్గురు ననుసరించిన నీ సమస్త భారము అతడు వహించి, నీకు వలసిన పరివర్తనము గావించి నిన్నుద్ధరించును. ఇవి యన్నియు అతడు నీయందు నిశ్శబ్దముగ నిర్వర్తించును. ఇదియే ఉపదేశము. అనగా అతడు నీయందుండుటే. ఉపదేశములు ఇట్లు రహస్యముగ జరుగును గాని పటాటోపము లేవియు నుండవు.

72

# వికాసము

సద్గురు బోధనలను ఫలితములకై ఎదురు చూడక ఆచరింపుము. స్మృతి ద్వారా అతని సాన్నిధ్యమును నీ యందు నిలుపుకొనుము. ఆ సాన్నిధ్యము నందే పనులను చక్కబెట్టుకొను చుండుము. విరామ సమయమున నీ హృదయా కాశమున అతని నగుమోమును చూచుటకు ప్రయత్నించుము. హృదయమున అతని చిరునవ్వు వికాసము కలిగించును. అటుపైన అతని బోధలు వినిపించును. సద్గురు బోధనము అంతర్ముఖమే అని ఎరుగుము.

73

# ధ్యానము - మార్గము

ఆత్మజ్ఞానమునకు ధ్యాన మావశ్యకము. సమయ పాలన మొనర్చుచు మొదట ధ్యానము సాగింపవలెను. అనగా నిర్ణీత సమయమునకే ధ్యానము చేయుచుండ వలెను. దీనివలన మనస్సునకు ప్రశాంతత ఏర్పడును.

ప్రశాంతమైన మనస్సుతో అందరియందలి ఆత్మను దర్శించుట అభ్యసించవలెను. దీనివలన అంతర్ముఖ ధ్యానము పట్టుచిక్కును. లోపల దేనిని చూచు ప్రయత్నము చేయుచుంటివో, దానినే బయట అన్నిటియందు గుర్తించుట ధ్యానమునకు తాళము చెవివంటిది.

లోపలను బయటను ఆత్మతత్త్వమును గుర్తించి నపుడు నీకదియే మిగులును. ఇతరములు జారిపోవును. క్రమశః నీవదియే అగుదువు. ధ్యానమార్గ మిదియే.

74

# ఈసడింపు

నీ వద్దకు వచ్చు ఏ జీవియందైనను నన్నే దర్శించుట నేర్చుకొనుము. నన్నుచూచి చిరునవ్వుతో పలుకరించుము. వచ్చిన జీవుని పని వీలున్నచో చేయుము. వీలులేనిచో ప్రేమపూర్వకముగ తెలుపుము. నీ దగ్గరకు వచ్చిన వానిని నీవీసడించి నచో, నీవు కూడ నాచే ఈసడింపబడుదువు.

75

# భాగవత రహస్యము

నాయందుండి ప్రపంచమును చూడుము. అపుడు ప్రపంచమున నే నగుపింతును. నన్ను మరచి ప్రపంచమును చూచినచో నే నుండక ప్రపంచమే యుండును. నీవు దర్శించు ప్రపంచము బంధ కారణము కాగలదు. నాయందుండి ప్రపంచమును నేనుగ చూచినచో అదియే మోక్ష కారణము. ఇది పరమ రహస్యము. భాగవత రహస్యము.

76

# నా మార్గము

నా మార్గము సహజ గంభీరము. డాంబికుల కందునది గాదు. సామాన్యులకు, నిష్కపటులకు, హృదయముతో ఆలోచించువారికి సుగమమైన మార్గము. నా మార్గమున నడచువారికి ఇతరుల అవసరములు చెప్పకయే తోచును. అట్టి అవస రములను వారు అడుగకయే నిర్వర్తింతురు. అందరియందు నన్ను దర్శించి వారు సేవ చేయుదురు. లాభములవైపు వారి దృష్టి పోదు. పారితోషికములకై వారెదురు చూడరు. గుర్తింపునకై వెంపర లాడరు. నా గురించి వెదకుట, నన్ను దర్శించి సేవ చేయుట, యితరుల నుండి నేను చూచినపుడు తృప్తి చెందుట వారికి చాలును. నా చూపు సూర్య కిరణమువలె వారి హృదయ పద్మము లను వికసింప చేయును.

77

# లబ్ధి

ఇతరుల శ్రమనుండి లబ్ధి పొందుటకు ప్రయత్నింపకుము. శ్రమకు తగిన పారితోషిక మును అందించుచుండుము. ఇచ్చుటలో ఉదారముగ నుండుము.

తెలివితేటలతో ఇతరులను నీవు దోచినచో నీవును దోచబడుదువు. ఒకరి నొకరు దోచుకొను టయే మానవ జాతికి శాపముగ పరిణమిల్లినది. సమదృష్టి, దయ, మిత్రత్వము నీవు నేర్వవలసిన విషయములు. నా అనుయాయి ఎవరినీ దోచడు. ఎవరి శ్రమను ఉంచుకొనడు. పుచ్చుకొనుచు బంధములను పెంచుకొనడు.

78

## జీవరంజనము

పద్మము సూర్యకిరణ స్పర్శకై ఎదురుచూచును. కిరణ స్పర్శ అందగనే వికసించును. వికసించిన పద్మము చూపరులకు ఆనందము కలిగించును.

దైవ ప్రార్థన గూడ అట్టిదే. ప్రార్థన చేయు జీవుడు దైవస్పర్శకై ఆర్ద్రతతో ఎదురుచూచును. దైవస్పర్శ కలుగగనే వికాసము చెందును. వికసించిన జీవుడు తోటి జీవులకు వినియోగ పడుచు అందరిని ఆనందింపజేయును. సత్ప్రార్థ నకు తుది పరిణామము జీవరంజనమే.

79

# ఊరకుక్క

ఇతరులను విశ్లేషించుట, వారి దుర్గుణముల నెన్నుట, వారి గురించి చెడుగ మాట్లాడుట సామాన్య మానవునకు పరిపాటి. గంటల తరబడి ఇతరుల ప్రవర్తనను గూర్చి అడ్డదిడ్డముగ మాట్లాడుట జరుగుచుండును. నీవట్లు చేసినచో నీ ప్రార్థన లన్నియు వ్యర్థములే. ప్రార్థనము ద్వారా పవిత్రమైన నీ మనస్సు, పై ప్రవర్తన ద్వారా బాగుగ మలిన మగుచుండును. కారణమేమన ఎదుటివారి మలినములను నాలుకతో నీవు పలుకునపుడు ఆ మలినము లన్నియు నీ నాలుక కంటును. అనగా ఎదుటివారి మలినములను నీవు నాకుచున్నావన్న మాట. అశుద్ధము నాకుట ఊరకుక్క స్వభావము. ఇది తెలిసి మసలుకొనుము.

80

# సహజత్వము

నీవు జనన మరణముల కతీతుడవై జీవించవలె నన్నచో ఎట్టి పరిస్థితుల యందును సహజత్వమును కోల్పోవరాదు. సత్యము సహజత్వము నుండే ప్రకాశించును. సహజత్వమునకు సత్వము అని మరియొక పేరు కలదు. సత్వస్థితి సహజ స్థితి. అది సత్యస్థితి కూడను.

వ్యక్తిగతము, సాంఘికము అగు డంబాచారమున పడకుము. అపుడు నీవు అసహజుడ వగుదువు. సత్వమును కోల్పోవుదువు. సత్యమునకు దూర మగుదువు. సహజముగ నుండుటకు చేయు ప్రయత్న ములో అహంకారము అదుపులో నుండును. శాంతి, మనోస్థిరత్వము దరిచేరును. మానసిక, భౌతిక నిశ్శబ్దము రుచియగును. మాట, చేత నిర్మలముగ నుండును. నీయందు అవగాహన లోతులు పెరుగును. మా మార్గమున పెరుగుట యనగా లోపలికి పెరుగుటయే. లోపలికెంత పెరిగిన అంత స్థిరముగ నిలబడుదువు. లేనిచో గాలికి, వానకు కూలుదువు.

81

# రసాయనము

మనిషి మహాత్ముడగుటకు రసాయన విద్య యున్నది. దాని నుపాసించుటకు క్రింది నియమములను పాటింతురు.

1. నాలుకను భాషణము విషయమున పరిశుద్ధముగ నుంచుకొనుట.
2. ప్రాణుల శ్రేయస్సు కొరకే పాటుపడుట.
3. దివ్యస్మరణము నిరంతరము గావించుట.

82

# నిర్వాణము

దైవము రూపమునందు, రూపమునకు వెలుపల, రూపమున కతీతముగను గూడ యుండును. అతడు రూపుడు, అరూపుడు, రూపాతీతుడు కూడ.

రూపాతీతుడైన దైవము కాలము నాధారము చేసుకొని రూపముల నేర్పరచుకొనుచు, వానిని విసర్జించుచు నుండును. రూపారూపములు కాలచక్ర వశములు. దైవము వాని కతీతుడు. అతీతుడైనప్పటికిని రూపారూప చక్రములయందు వసించుచుండును.

నిర్వాణ మనగా, రూపములేక తా నెట్లుండెనో తెలియుట. దీనినే తనను తాను తెలియుట అనియు, తన నిజస్వరూపము నెరుగుట యనియు పండితులు చెప్పుచున్నారు. రూపము నందుగల చైతన్యమును చూచుచు, చైతన్యముతో ముడివడి రూపమును మరచినచో మిగులునదియే నిర్వాణము.

83

# భిన్నత్వంలో ఏకత్వం

ప్రతి సద్గురువు భగవదాజ్ఞనే నిర్వర్తించుచున్నాడు. వారు నిర్వర్తించు కార్యక్రమ మొక్కటియే, అదియే దివ్య ప్రణాళిక. కార్యములందు వైవిధ్యము గోచరించిననూ అందేకత్వ మున్నది. ఒకరి కార్యము మరియొకరి కార్యముతో అనుపానము చెందియుండుట గమనింతుము. అట్లే ఒకరి కార్యమును మరియొకరు కొనసాగించుట గమనింపుము. ఒకే మార్గమునకు చెందిన అనేక దృక్కోణములను సద్గురువులు చూపుదురు.

ఒకే తరగతిలో నున్న నీకు నాలుగైదు రకముల శాస్త్రములు, నలుగురు లేక ఐదుగురు ఉపాధ్యాయులు వివరించుట లేదా? నీవు కన్నులు తెరచి చూడవలెను. చెవులు రిక్కించి వినవలెను. నిజమున కొకడే జగద్గురువు వివిధ సద్గురు రూపములనుండి నీకు సత్యము నందించు చున్నాడు. వితర్కించక, ఆచరించుచు సాగుము.

84

# నవవిధ మార్గములు

నవవిధ భక్తిమార్గములలో ఏ మార్గము నుపాసించిననూ నీవు సత్యమును దర్శింపగలవు. దీక్షతో ఒక మార్గమున నడువుము. ఇతర మార్గము లన్నియు నీ మార్గమున కలియగలవు. నీయందు సమన్వయింప బడగలవు. మీనమేషములను లెక్కించుచు నడచుట మాననిచో గమ్యము చేరలేవు.

85

## డంబాచారుడు

నీవు నిజముగ దైవమును ప్రేమించుచుంటివా? అట్లైనచో నీవు ధర్మాచరణము నందుందువు.

నీవు నిజముగ ధర్మ మాచరించుచుంటివా? అట్లైనచో నీ యందు జీవకారుణ్యముండును.

జీవులను ప్రేమింపనివాడు దైవమును ప్రేమింపలేడు.

కరుణ, దయ, హితకార్యము, జీవుల కొనర్పక దైవారాధనము చేయువా రందరును డంబాచారులే.

దైవము లేనిచో ధర్మము లేదు. ధర్మము లేనిచో ప్రేమ లేదు. ప్రేమ లేనిచో దైవము లేదు. ధర్మమందుండిన దైవముండును. ప్రేమ గూడ యుండును. అట్టివాడే ధర్మరాజు.

86

# కన్నుల పండుగ

సద్గురువునకు బహు ముఖములు గలవు. అతడు సమయమున కొక ముసుగు వేసుకొనును. ఒక నటన జేయును. ప్రతి నటనయందు సందేశముండును. ధర్మ సూక్ష్మ ముండును. అతని నటనయందు గల ధర్మ సూక్ష్మము నెరిగినవాడే అసలైన శిష్యుడు.

సద్గురువొకప్పుడు మౌనముగ నుండును. ఒకప్పుడు ఎక్కువగ మాట్లాడును. మరియొకప్పుడు పగలబడి నవ్వు చుండును. ఇంకొకప్పుడు తీవ్రమైన కోపమును ప్రదర్శించును. హాస్యము కూడ చేయును. పదిమందిని తనచుట్టును కూడగట్టుకొని యుండును. ఒకప్పుడు ఒంటరిగ యుండును.

ఒకప్పుడు క్లుప్తముగ బోధించును. ఒకప్పుడు వివరముగ బోధించును. ఒకప్పుడు శరీరమున నుండును, మరియొకప్పుడు విదేహిగ నుండును. సద్గురువును, అతని నటనలను గమనించుచు ఆనందించుట కన్నుల పండుగ.

87

# స్వతంత్రత

జీవుడు గుణాతీతుడే. అతని నుండి పుట్టిన గుణముల నుండి అతడు ప్రవర్తించును. ప్రవర్తనకు గుణము లావశ్యకము. ప్రవర్తన మావశ్యకమైనపుడే గుణముల నాశ్రయించుట, ఆవశ్యకత లేనపుడు వాని కతీతుడుగ నుండుట స్వతంత్రుడి లక్షణము.

తననుండి ఏర్పడిన గుణములయందు చిక్కు కొనుట బద్ధత. బద్ధునికి సృష్టియొక కారాగారము వంటిది. స్వతంత్రుని కది క్రీడారంగము.

88

# అనిర్వచనీయుడు

సద్గురువు బోధలు ఆచరణాత్మకముగ నుండును. అతడాచరించుచు బోధించును. అతడు నిరాలంబుడు. అనగా ఎవరిపైననూ ఆధారపడడు. తనపైనే తా నాధార పడును. అతడు సహకారి. సహకరించుటయే గాని పోటీపడుట అతని యందుండదు. అత డెవరినీ శాసించడు. అతడు సచేతనములందు, అచేతనములందు సమభావము కలిగియుండును. అతడు సామాన్యముగ రూపమునందున్న దైవమును చూచును. అవసరమగుచో నామరూపములను గుర్తించును. అతడు వినయము గను, అప్రమత్తుడుగను యుండును. దేనియందును అశ్రద్ధ చూపడు.

సద్గురువు గుర్తు తెలుపువాడేగాని, గుర్తింపు కోరువాడు కాదు. తాను చేయవలసినది చేయుటయే గాని, తనను గురువుగ నిర్వచించుకొనడు. అతనికి నిర్వచనమే లేదు.

89

## తాబేలు - కుందేలు

ఆకలినిబట్టి తినుట యుండునుగాని, తిండినిబట్టి ఆకలి యుండదు గదా ! తిండి యధికమైనచో అజీర్తి చేయును. శక్తికి మించి సాధన చేసినచో వికటించును. సాధ్యపడినదే సాధన. సాధ్యపడినంత చేసినచో అంత రాయము లేక సాధన సాగును. ఎక్కువ తిన్నచో మరుపూట ఉపవాసము తప్పదు గదా! ఎక్కువ అను పదమునకు అర్థము లేదు. సాధనయందది నిరర్థక మగును. దీర్ఘ కాలము, నిరంతరము సాధన సాగుటకు మితముగ సాధన చేయుము. లేనిచో కుందేలు కథ యగును. తాబేలు గమ్యము చేరును గాని, కుందేలు గంతులు వేయుచు గమ్యము చేరదని తెలియును గదా!

90

# శిష్య శ్రేణి

సద్గురు హృదయమున నున్నది తెలుపకయే ఆచరించు శిష్యుడు ఉత్తముడు.

సద్గురువు తెలిపినది తెలిపినట్లాచరించినవాడు మధ్యముడు.

సద్గురువు తెలిపినది తనకు తోచునట్లాచరించు వాడు అధముడు.

ఇందు ఉత్తమునకు సద్గురువు దేహమునందు లేనప్పటికిని కర్తవ్య మాగదు. ఇతరుల కాగును.

91

## ఒక సూత్రము

ఓర్పు వహింపుము. క్షమ కలిగియుండుము. అట్లు కానిచో నావద్ద యుండలేవు.

పై రెండు గుణములు నీ యందు నిశ్చలత్వము కలిగించును.

అదిలేనిచో ఇహపరములు లేవు.

అంతర్లోకానుభూతికి, బహిర్లోకానుభూతికి నిశ్చలత్వమే ప్రధానము.

నిశ్చలత్వము ఇహపర సుఖములకు సూత్రము.

92

## దోపిడి

నీవమితముగ అనుభవించునది, భోగించునది, ప్రేమించునది యితరుల కీయగలవా?

ఈయగలిగినదే భోగించుము. నీ వీయలేనిది నిన్ను బాధించును.

నీ విచ్చిన దెల్ల నాకిచ్చినదే. నీవు పోగొట్టుకొనిన దెల్ల నేను దోచినదే.

నీ వీయలేవు గదా! అది నిన్ను బాధించును గదా! అందులకే దోచుకొందును.

ఇది కృష్ణుని దోపిడి!

93

# సమర్పణ

నాకు సమర్పణ చెందుటకు సులభమగు మార్గ మొకటున్నది. నీవు తిను తిండి నాకు సమర్పణముగ తినుము. నీ వినికిడి నాకు సమర్పణముగ వినుము. నీవు చూచునది నన్నే అని గుర్తుంచుకొనుము. నీవు మాట్లాడునది నాతోనే అని తెలియుము. నీవు స్పృశించినది కూడ నన్నే. నీవు భోగించునది నన్నే. ఇట్లు నన్ను చూచుట, వినుట, స్పృశించుట, భోగించుట పరిపూర్ణమైనచో నేను తప్ప నీ కేదియును వుండదు. ఇది నిజమగు పూజ. ఈ పూజకు తతంగము లేమియును లేవు. నీవు లేచిన క్షణము నుండి నిదురించు క్షణము వరకు నిత్యపూజ చేయుచునే యుందువు. నిదురయందు నా యందుందువు. నీకు మెలకువలోను, నిదురలోను నేనే యుందును.

94

# ప్రత్యంగిర

ఇతరుల మతమును, దైవారాధనమును హేళన చేయకుము. విమర్శింపకుము. దూషింపకుము. నన్ను గూర్చి ఎట్లు ఆరాధించినను నాకది సమ్మతమే. నీకు సమ్మతము కాకున్నను నాకు సమ్మతమే. ఈ విషయమున నీ వప్రమత్తుడవై యుండుము. నీ హేళన, విమర్శ, దూషణము నన్ను చేరును. మీరు నాకందించిన వన్నియు మరల మీకే అందింపబడును. శుభములు, అశుభములు మీకిట్లే కలుగుచున్నవి. మీ రొనర్చిన శుభకార్యములు మీకు శుభములు, అశుభ కార్యములు అశుభములు కలిగించునని తెలిసి అప్రమత్తులై జీవింపుడు.

95

# పరిష్కారము

సత్యమొక్కటే. దైవమొక్కటే. చైతన్యమొక్కటే. ప్రాణ మొక్కటే. పదార్థమొక్కటే. పంచభూతములొక్కటే. విశ్వాత్మకమగు మనస్సొక్కటే. బుద్ధి యొక్కటే. పంచేంద్రియము లొక్కటియే. అంతయునూ ఒక్కటియే యైనను, అహంకారము కారణముగ వేరుగ గోచ రించును. అహంకార భావమే మాయ. అహంకార మనగా ఇతరులకు వేరుగ తా నొకడున్నాడన్న భావము. ఈ భావమే మాయాస్వరూపము. అందరి యందున్నది ఒక్కటియే యైనను, ఎవరికి వారున్నారను భావన కలిగించునదే మాయ. ఇది లేనిచో సృష్టి లేదు. ఇది యున్నచో సృష్టి అగమ్యమై భ్రమను కలిగించును.

దీనికి పరిష్కారము, మొత్తమే తానుగ నున్నదని స్మరించుట. అనుస్మరణము చేయుట.

96

# స్మరణ మార్గము

నన్నుస్మరణ చేయుటకు జీవుడేర్పరచుకొన్నవే నవవిధ భక్తి మార్గములును. నా స్మరణ మరచి వివిధ మార్గముల నడచుటలో ఫలము లేదు. మార్గములకన్న స్మరణమే ముఖ్యము. నేనే నీవుగ వున్నావని నీవు మరువ నంత వరకు అన్ని మార్గములు సుగమములే. స్మరణ లేనిచో మార్గములు కేవలము శ్రమనే కలిగించును.

97

## విద్యా రహస్యము

నీ వితరులకు వైభవము కలిగించు ప్రయత్నము చెయ్యనిచో నీకును వైభవము కలుగదు. నీ వితరులకు ఏ మొనర్తువో అవి నీకును ఒనగూడును. ప్రస్తుతము నీకు లేనివి, నీ వెప్పుడును ఇతరుల కీయనివి. నీ కున్నదే శ్రద్ధగ పంచుము. ఇచ్చి పుచ్చుకొనుట సృష్టి ధర్మము. పుచ్చుకొనుటకు విద్యలవసరము లేదు. ఇచ్చుట నేర్చుటకే అన్ని విద్యలును.

98

# దారులు

నే నెల్లప్పుడునూ నిన్నే చూతును. నీ లోనుండి చూతును. వెలుపల నుండి కూడ చూతును. ఇది నాకు నీపై గల ప్రేమ. నీవును అట్లే చేసినచో అది భక్తి అనబడును. నీవును నన్ను లోపల, వెలుపల చూడుము. నాకు నీ మీదున్నంత ప్రేమ నీకు నామీద వున్నదా? అట్లున్నచో నీవు పరిపూర్ణుడవై ఇతరులకు కూడ పరి పూర్ణతను అందించగలవు. లేనిచో నీ దారి నీది. ఎప్పటికో నా దారి పట్టగలవు.

99

# ఆలోచించుకో

పిచ్చివాడిని చూచి నవ్వుదురు. కాని వానికున్న తృప్తి నీకున్నదా? వానికీ ప్రపంచమే లేదు. నీకున్నదే ప్రపంచము. వానిని చూచి నువ్వు నవ్వుటలో అర్థము లేదు.

పిచ్చివానిలో ఒక తృప్తి కనబడుతుంది. వాడు పెడితే తింటాడు. పెట్టకపోతే తినడు. పెట్టినా ఒకప్పుడు తినడు. నీవో? పొట్టకోసం ఆరాటపడుతూ జీవిస్తూ వుంటావు. నీవు పేదవు. పిచ్చివాడు రాజు.

ఆలోచించుకో !

100

# మరణము

మొత్తముగ నేనుండగ నేనొకడ నున్నానని నీవు భావించుట, నీకు మరణ కారణమైనది. నేనే నీవుగ నుండగ నీవు నన్ను మరచి జీవించుచున్నావు. నీవు మరణించినపుడు మరల నేనుగ తెలియగలవు. దేహ మరణము నీ మరణము కాదు. అహంకార మరణమే నిజమగు మరణము. అహంకారము కరిగిన క్షణమున నీవు నేనై మరణము దాటుదువు. అంతవరకును జనన మరణములు నీకు జరుగుచునే యుండును.

101

# మఱపే రహస్యము

నేను లేనను వారున్నారు. వారిని "నీవున్నావా?" అని అడిగితే "ఉన్నాను" అంటారు. వారుండుట నే నుండుటయే కదా! వారు ఎట్లు వున్నారో వారికి తెలియదు. వారి ఉనికికి ఆధారము వారు తెలుసుకొన ప్రయత్నించినచో వారికి నే నున్నానని తెలియును. నేనే వున్నానని తెలియును. ఇక వారుండరు. వారు, నేను లేనను చున్నారు. నిజమునకు వారే లేరు. నేనే వున్నాను. ఇది ఒక రహస్యము. ఈ రహస్యము నీ మఱపువల్ల ఏర్పడినది తప్ప నేను దాచిపెట్టినది కాదు.

102

## వృక్షములు - గురువులు

చెట్లు పూలు పూయును. పువ్వులు క్రమముగ కాయలగును. కాయలు పండ్లగును. పండ్లయందు విత్తనములేర్పడును. విత్తనములు కాలక్రమమున వృక్షములు కాగలవు. ఇట్లే మీరును.

నాస్తికు లాస్తికు లగుదురు. ఆస్తికులు ఆర్తులు అగుదురు. అర్థార్థు లగుదురు. అటుపైన జిజ్ఞాసువు లగుదురు. అటుపైన జ్ఞాను లగుదురు. అటుపైన హరికళ పొందుదురు. వారినుండి హరికళ ప్రసారమై ప్రకాశించును. మరల వారినుండి నాస్తికులు ఆస్తికు లగుటగ సాగును.

సద్గురువు వృక్షమువంటి వాడు. ఇతరులను కూడ వృక్షములుగ చేయుట అతని పని.

103

## ఋషి

నీవు నామరూపాత్మకమైన జగత్తును చూతువు. కాని, ఆ నామమునకు, రూపమునకు ఆధారమును తెలియలేవు. నీవు చూచు రూపములన్నీ ఎట్లేర్పడు చున్నవి? ఆ రూపము నందలి రంగు లెట్లేర్పడుచున్నవి? నిర్దిష్టమగు సంఖ్యలుగ అన్ని రూపములందు ఎట్లు స్థితి గొనుచున్నది? నీవు విను శబ్దము లెట్లేర్పడు చున్నవి? ఈ మొత్తమున కాధారమేమి? ఆధారము తెలియుటయే తెలియుట.

ఋషులు ఆధారము నెరిగినవారు. ఆధారమును గొని శబ్దములు, వర్ణములు, అంకెలు, రూపమున తేలుచున్నవి అని వారికి తెలియును. నదిపై తేలుచు పయనించుచున్న అనేకానేక జీవములు నదీ ప్రవాహ మాధారముగనే పయనించుచున్నవి కదా!

ఆధారమునకై అన్వేషించుము. కాలక్రమమున ప్రవ హించుచు పోవుచు నున్న విషయములపై ఆసక్తిని వదలుము. కనబడని ప్రవాహము కనిపించుచు జలములను, జలచరము లను నడుపుచు నున్నట్లే కనపడని తత్త్వము కనిపించు జగత్తును నడిపించుచున్నది. కనపడనిది, కనపడుదానిని నడిపించును. కనపడని దానిని చూచువాడే ఋషి.

104

# నా ఆకాంక్ష

ఋషి దృష్టికి జగత్తంతయు విభూతియే. జగత్తున కాధారమైన ఈశ్వరు నెరిగినవారు ఋషులు. వారు ఈశ్వరునందుండి జగత్తును విభూతిగ నానందింతురు. వారు కర్తవ్యములందు నిమగ్నులై యుండియు, విభూతిని ఈశ్వరానుభూతిగ పొందుచు నుందురు.

నేను విభూతి పంచుచున్నాను. అది ఈశ్వరునిది. మీరును ఈశ్వరత్వము నెరిగి ఈశ్వర విభూతిని అనుభూతి నొందవలెనని నా ఆకాంక్ష. అందులకే విభూతి వితరణ.

105

## మురిపెము

నీవు చూచు రూపములన్నియు జగత్తుయొక్క గమ్మత్తుయే. నిజమునకది నేనే. నీకు వేరు రూపముగ కనబడుట నా గమ్మత్తు. నాకు నామము, రూపము లేవు. కాని నామము రూపముననే మీకు కనిపింతును. మీకు కనిపించు రూపములన్నియు నేనే. మీకు విని పించు నామము లన్నియు నేనే. బంగారమున ఉంగర మెట్లు లేదో, నాకు రూపము లేదు. మీరు ఉంగరమును చూసి మురియుదురు. అనగా, రూపములను చూచి మురియుదురు. రూప మూలమును చూచిననే నిజమగు మురిపెము కలుగును.

106

## శరణాగతి

దైవమునకు గాని, గురువునకు గాని కర్తృత్వము లేదు. అయిననూ తమకు సంపూర్ణముగ శరణాగతి చెందినవాని యెడల కర్తృత్వము వహింతురు. శరణాగతియన్న, సందేహములు లేని సమర్పణయని అర్థము. సందేహము శరణాగతికి శత్రువు.

107

# నిత్య ప్రార్థన

ఓ ప్రభూ! నా మనస్సు అంతర్ముఖమై దివ్యత్వమునకు మరలుటకు నన్నాశీర్వదింపుము. అంతర్ముఖ దర్శన విభూతిని నా కనుగ్రహింపుము. నీ విభూతియందు నా మనస్సు కరిగిపోవు భక్తిని ప్రసాదింపుము. నీయందు కరగిన నా మనస్సు, మరల నీ మనస్సుగ జనించి నీ కార్యములను నీవే చక్కబరచుకొనుము. నీవే నేనుగ జీవించు అనుభూతిని ప్రసాదింపుము.

ఇది మీరు చేయవలసిన నిత్యప్రార్థన. నేను చేయు నిత్యప్రార్థన కూడ నిదియే.

108

# స్థితప్రజ్ఞత్వం

జీవన ప్రవాహమున సన్నివేశములు తరంగములై నిన్ను సమీపించి స్పృశించును. సన్నివేశములను "నన్ను"గ భావింపుము. భావింపనిచో సన్నివేశములందు చిక్కుకొందువు. భావించినచో నీవు నా యందుండుటచే, సన్నివేశము చిక్కుపెట్టక దాటిపోవును. అందు నీ కర్తవ్యము కూడ నీకు స్పష్టముగ తెలియును. ఈ విధముగ నీవు స్థితప్రజ్ఞుడవు కాగలవు. నీవపుడు జీవన తరంగములను అనుభూతి చెందగలవు.

109

# నిత్యక్రతువు

ప్రతిదినము నీ సద్గురువు పాదపద్మములను హృదయవేదికపైకి ఆహ్వానింపుము. నీ కన్నీటి వేడిమితో అతని పాదములను కడుగుము. నీ ప్రేమ యను గంధమును అతని పాదములకు పూయుము. స్థిర చిత్తము అను తెల్లని వస్త్రమును అతనికి సమర్పింపుము. ప్రశాంత మను పుష్పమును అతని పాదపద్మముల యొద్ద నుంచుము. ఆర్ద్రతతో కూడిన ఆరాధనము అతనికి నైవేద్యము కావింపుము. శిరస్సు వంచి అతని పాదముల బొటనవ్రేలికి ఫాలము సోకునట్లు మ్రొక్కుము. ఇది నీ నిత్యక్రతువు.

110

# ఋణవిముక్తి - ముక్తి

జీవితమున చేసిన బాకీలను తీర్చక ఎవ్వరునూ తప్పించుకొనజాలరు. ఋణములు తీర్చక తప్పించుకొనువారికి ఋణభారము పెరుగుచుండును. ఋణభారమే కర్మభారము. కొందిరికి కర్మభార మెక్కువగనుండును. అనగ చాల ఋణము చేసినారన్నమాట. అట్టివారు సద్గుణముల నాశ్రయించి, ఋణములను తీర్చుకొనుట ఒక్కటియే మార్గము. ఋణవిముక్తియే ముక్తికి మార్గముగాని, వేరుమార్గములు ముక్తికి లేవు.

111

# గురువు - ఈశ్వరుడు

పుణ్యనదులన్నియు సాగర సంగమము చేయును. కావున సాగరమున స్నానము అన్ని నదులలో స్నానము చేసిన ఫలితము నీయగలదు. అట్లే సద్గురు పాదపూజ సర్వదేవతా పూజతో సమానము. సద్గురువునందు సమస్త దేవతలు దర్శనమిత్తురు. అత డీశ్వరుడే!

112

# నేనే మార్గమును

సద్గ్రంథము లన్నియు సత్యమునకు మార్గము చూపును. సత్యమనగా దేవుని మరియొక నామము. సద్గ్రంథము లెన్నిచదివిననూ, దైవమునుచేరు మార్గమున నడచుట సులభము కాదు. ఎందువలననగా, సద్గ్రంథ మును చదువు చదువరి గ్రంథమును తన సంస్కార మును బట్టి అర్థము చేసుకొనునేగాని, గ్రంథము బోధించు సత్యమును కాదు. మాయచే కప్పబడ్డవాడు, మాయనుండి సత్యమును చూడగా మాయా సత్యమే గోచరించునుగాని, సత్యము గోచరించదు. ప్రయాణము సాగదు.

ఇట్టివారికే సద్గురువావశ్యకత. సద్గురు సాన్నిధ్య మున మాయా మోహములు నశించును. అతని సాన్నిధ్యమున నిలచి నడచుటయే, సాధకునకు మార్గము. సద్గురువు అందులకే “నేనే మార్గమును” అని పలుకుచుండును.

113

# రహస్య బంధము

శిష్యుడు గురువునకు సేవ చేయును. గురువు శిష్యునకు అంతకుమించిన సేవ చేయును. ఇట్లొకరికి నొకరు సేవ చేసుకొనుట గురుశిష్య సంప్రదాయము. శిష్యుడు గురువాధారముగ జీవించును. గురువు తన యందు, శిష్యునియందు, సమస్తమునందుకల ఈశ్వరు డాధారముగ జీవించును. శిష్యుడు చేయునది గురుసేవ, గురువు చేయునది ఈశ్వరసేవ. ఇది వారి రహస్య బంధము.

114

# కాలాంతకుడు

సద్గురువు ఆత్మజ్యోతిని వెలిగించును. జీవుడాత్మ నెరుగుటకు వలసిన మార్గమున ప్రవేశింపజేసి నడిపించును. చేయిపట్టి నడిపించు సద్గురువు ఎన్నడునూ చేయి వదలడు. గమ్యము చేరువరకు వదలడు. అతని పట్టు మొసలి పట్టుయే.

తలిదండ్రులు జన్మనిత్తురు. కాని ఆ జన్మ మరణముతో సరి. సద్గురువు మరణమునకే మరణము కల్పించి, జీవుని అమృతునిగ చేయగలడు. అతడందించు జీవితము జనన మరణాతీతము. అతడంతము నంతము జేసి, అనంతమున జీవుని నిల్పగలడు. అతడనంతుడు. కాలాంతకుడు.

115

# నిత్య స్మృతి

సద్గురువు సాన్నిధ్యము కర్మరాహిత్యమును గావింపగలదు. సాన్నిధ్యముననున్న మార్కండేయునకు యమశాసనము కూడ లొంగినది. సాన్నిధ్యమే సర్వ సమస్యలకు పరిష్కారము. సాన్నిధ్యమే మోక్షము. సాన్నిధ్యము నిత్య స్మృతి వలన కలుగును. నిత్య స్మృతి సాధన. సాన్నిధ్యము సిద్ధి.

116

# కోరిక

నీకు ఏది మేలో, ఏది కీడో నీకుగ తెలియదు. కీడు కలిగించునవి మేలు కలిగించునవిగ, నీకు భ్రమ కలిగించుటచే నీవవి కోరుచు నుందువు. జీవితమున ప్రయత్నించిననూ దొరుకనివి వదలుటయే క్షేమము.

నీవు తలచినది కోరుదువు. వలసినది కోరలేవు. అందువలన కోరుట మాని, కర్తవ్యము నిర్వర్తించుము. నీకు వలసినవి నీ వద్దకు చేరును. నిన్ను సుఖపెట్టును. అంతకుమించి కోరినచో కష్టములు కొనితెచ్చుకొనుటయే.

117

# కలి ధర్మములు

విడిపడుట, వేరుగా నుండుట, ఇతరుల పొత్తు నచ్చకపోవుట కలిధర్మములు. ఈ భావములు కలవారు క్రమముగ ఏకాకులు కాగలరు. స్వార్థపరులు కాగలరు. నీవు స్వార్థపరుడవా? కావా? అని తెలియవలె నన్నచో పై గుణము లున్నవా? లేవా? చూచుకొన వలెను. స్వార్థము కరుడు గట్టవలెనన్నచో పై గుణములకు అసూయ, ద్వేషము, కోపము తోడుగ రాగలవు. ఇట్టివారు సహజముగ అసహనముతో నుందురు.

జీవితమొక సాగరము. దానియందు మునుగుటకు పై గుణములే కారణము. దానియందు తేలుచు ప్రయాణించుటకు వలసినది సహనము, సహజీవనము, పరస్పర సహకారము. ఈ మూడు గుణములున్నచో మూడు లోకములను దాటగలవు. సద్గురువు ప్రాథమిక ముగ అందించు విద్య నిదియే.

118

# నా మార్గము

నీ యందు నే నున్నాను. నీయందు నేనే దైవము. నా యందలి నీవు నన్ను శరణుజొొచ్చి నా కర్పితముగ జీవించుము. అట్లు నీవు జీవింపగలిగినచో నీ బాధ్యత లన్నియు నేనే వహింతును. నీవు నా అనుచరుడవై శాశ్వత ఆనందము పొందగలవు.

ఈ నేను శాశ్వతుడను, అపరిమితుడను. నన్ను అనుసరించు నీవు శాశ్వతుడవు, అపరిమితుడవుగకూడ నుండగలవు. అయస్కాంత సన్నిధి చేరిన ఇనుము అయస్కాంతమే అగుచున్నది కదా! ఇది నన్ను జేరు మార్గము. నీవు నేనుగ నుండు మార్గము. నా మార్గము.

119

# మనస్సు - పగ్గములు

చంచలమగు మనస్సునకు స్థిమితము దక్కవలె నన్నచో, స్థిరము కలుగవలెనన్నచో ధ్యానము ఉపాయము కాదు. సద్భావములు, సత్కర్మలు, సదాచరణము, సమాచరణము ఉపాయములు.

సత్కర్మాచరణము లేనివానికి మనస్సు, ఇంద్రియ ములు, శరీరము స్వతంత్రించి వేనికవిగ పనిచేయు చుండును. వాని మధ్య పొత్తు కుదరదు. చంచ లత్వము, ఆవేశము కారణముగ ఆరోగ్యము కూడ చెడును. సత్కర్మాచరణము పుణ్యము కొరకు కాదు. మనస్సు, ఇంద్రియములు, శరీరము తనకు తోడ్పడు టకు. శరీరమను వాహనము యొక్క పగ్గములు తన హస్తగత మగుటకు. అప్పుడే నిజమగు జీవన యాన ముండును. జీవన ప్రయోజనము తెలియును. గమ్య మేర్పడును.

120

# సాక్షి

సర్వమును గమనించుచు నుండుట యొక విద్య. గమనించుట బాహ్యముగను, అంతరముగను గూడ నుండును. బాహ్యమున సన్నివేశములను గమనించుట మొదట నేర్చుము. అందు త్వరపడి జొరబడక గమ నించుట నేర్చుము. ఇట్లు దీర్ఘకాలము నేర్వవలెను. అటుపైన అంతరమున గమనించుట మొదలిడుము. అంతరమున భావములు వచ్చుచు, పోవుచు నుండును. వానిని గూడ గమనించుచు నుండుము.

బాహ్యమునగాని, అంతరమునగాని కర్తవ్యములను అశ్రద్ధచేయక నిర్వర్తించుచు, కర్తవ్యములు కాని వానిని గమనించుచు నుండుము.

నీ మనస్సులోని భావములు, నీలోని శ్వాస, ప్రాణ స్పందనములు, నాదము, ఇత్యాదులను గూడ గమనించుచు నుండుము. గమనించువాడివిగ నీవు బాహ్యము నుండి, అంతరము నుండి గూడ విడిపడి యుండెదవు. ఇది మోక్షస్థితి.

121

## అనుసరణ - అవగాహన

సద్గురువును నిర్వచించుటకు ప్రయత్నింపకుము. అతడు అనిర్వచనీయుడు. అతనిని అతడు ప్రకటించు కొనినపుడు ప్రకటించినంత మాత్రము తెలియును. తన గురువును గూర్చి తనకు తెలుసు అని ప్రకటించు శిష్యుడు మూర్ఖుడు. తన స్వభావము నుండి తనకు గోచరించినదే తన గురువు అనుకొనుట జరుగును. ఎవరెట్లు చూచిన సద్గురువట్లు గోచరించును.

సద్గురువు నవగాహన చేసుకొనుటకన్న అతను అందించిన బోధనల ననుసరించుట మేలు. అనుసరణ మార్గమున సర్వమును క్రమముగ తెలియగలదు.

122

# నా ప్రకృతి ధర్మము

నీవు నాటిన బీజమే మొలకెత్తునుగాని, మరియొక మొక్క రాదు. వేపగింజను పాతి మామిడిచెట్టు నాశించుట అవివేకము.

నీవిచ్చుట నేర్చినచో నీకు వచ్చుట యుండును గాని, ఇవ్వనిచో నీకు వచ్చునదేమియు లేదు. నీవు యిచ్చినదల్ల పదింతలై నీకు తిరిగి వచ్చును. ఇతరులకు సుఖము నిచ్చిన యెడల పదింతలై సుఖము తిరిగి వచ్చును. ఇతరులకు దుఃఖము నిచ్చినయెడల అదియును పదింతలై తిరిగి వచ్చును. ఒక మామిడి విత్తనమును పాతినచో వందల పండ్లు కాలక్రమమున నీకు లభించును. ఒక విషబీజము నాటినచో వందల విష ఫలములు నిన్నాక్రమించి దుఃఖింపజేయును.

ఇది నా ప్రకృతి ధర్మము.

123

# హెచ్చరిక

నీకేమి కావలసినను సూటిగ నన్నే కోరుము. నాపేరు నుపయోగించి యితరుల నుండి ధనముకాని, లబ్ధినిగాని పొందుటకు ప్రయత్నింపకుము. నాకిది నచ్చని విషయము. నా కార్యములకు నీకున్నది సమర్పించు కొనుము. నిన్ను కూడ సమర్పించుకొనుము. ఇతరు లను సమర్పింపుడని ఒత్తిడి చేయకుము. నా మార్గమున నీవుండుటయే నే కోరునది. నాకు ప్రచారకు లవసరము లేదు. నా పేరున ప్రచార కార్యక్రమములు నే నిచ్చ గింపను.

124

# నా మాయ

నా కొరకై వెదుక నక్కరలేదు. నన్ను చూచుటకు నీ వెచ్చటికిని ప్రయాణించ పనిలేదు. నీ వున్నచోటనే నే నున్నాను. నీ వున్నచోట నీవు గమనించినచో నే నగుపింతును. నీ రూపమున నే నుండగ నీవున్నా వనుకొను చున్నావు. ఇదియే మాయ. నా మాయ.

నన్ను చూచినచో మాయ మాయమగును. లేనిచో నీకుండునది మాయయే.

125

# నా దర్శనము

దీనులకు, బలహీనులకు నే నున్నాను. బలవంతుల యందు బలముగ నున్నదికూడ నేనే. వారది గమనింపక అహంకరించుట వలన బలహీన పడుదురు. అహంకారమే అన్నిటికిని మించిన బలహీనత. రావణాదులట్లే అహంకరించి బలహీన పడిరి.

దీనులు, హీనులు నా బలముననే జీవించుచు నున్నారు. వారి సహజత్వము, సామాన్యత్వము, నిర్మ లత్వము రూపమున నేను దర్శన మిచ్చుచు నుందును. నన్ను దర్శింపకోరువారు ఈ మూడు గుణముల నుండి దర్శించవచ్చును.

126

# నా దీక్ష

నేను మరణము చెందని వానినని, అమరుడనని నా యనుయాయులకు నిదర్శన పూర్వకముగ చూపితిని. అయినను నేను మరణించితినని చాల మంది భావింతురు. నే నమరుడనని ప్రకటించుటకే నా సమాధి నుండి ఆశ్రితుల కందరికిని ఆశీస్సుల నందించుచున్నాను. కొందరికి కనపడుచున్నాను. కొందరికి వినపడు చున్నాను. మరికొందరికి సాన్నిధ్య మిచ్చుచున్నాను. ఇట్లు చేయుటకు నాకు దేహ మవసరము లేదు. మీ దేహము లన్నియు నావియే. మీ వినికిడి ద్వారమున మీకు వినిపింతును. మీరు కను ద్వారమున మీకు కనుపింతును. మీ హృదయమున సాన్నిధ్యమిత్తును. ఇట్లు అన్ని దేహముల యందును స్ఫూర్తి నిచ్చి నడిపించుట నేను పట్టిన దీక్ష.

127

# నా ఆదేశము

మీ కుటుంబములో నౌకరు మరణించినపుడు ఏడ్చుట, గుండెలు బాదుకొనుట యిత్యాదివి చేయకుడు– నిష్క్రమించుచున్న జీవికి సహకరించుడు. నిశ్శబ్దముగ సహకరించుట యొక విధానము. సద్గ్రంథములు పఠించుట మరియొక విధానము. సూక్తములు, స్తోత్రములు, గీతములు, భజనలు చేయుట యింకొక విధానము. జీవించునపుడు సహకారమందించుట ఎంత వివేకమో, మరణించునపుడు కూడ అంత సహకారమందించుట, అంతకు మించిన సహకారము. జీవుడు పుట్టినపుడు, జీవించునపుడు, మరణించి నపుడు కూడ అందించవలసినది సహకారమే. ఇది నా ఆదేశము.

128

## ఒక యోగి కథ

ఒక మహాత్ముని జననము, జీవనము, దేహ త్యాగము అత్యంత సామాన్యముగ, పవిత్రముగ, నిశ్శబ్దముగ జరుగును.

మహాత్ముడు దేహమున ప్రవేశించుట తన అనుయాయుల నుద్ధరించుట కొరకే. వారి కొరకై దర్శనాత్మక జీవనము జీవింతురు. దర్శనాత్మక బోధనలు చేయుదురు. అతని జీవితమున గాని, బోధనలలో గాని ఉద్వేగ ముండదు. నిర్మలమగు సెలయేరువలె జీవనము సాగును. నిష్క్రమణ సమయమున అనుయాయుల హృదయమున ప్రతిష్ఠితమై వారిని నడిపింతురు. ఇట్లు మహాత్ములు దృశ్యముగను, అదృశ్యముగను, జీవులను నడిపించు చునే యుందురు. అట్టివారిలో నే నొకడను.

129

## ప్రాథమిక ధర్మము

ఇతరుల ఆకలి ఎరుగనివాడు వేదములు, వేదాంగములు, శాస్త్రములు, పురాణములు చదివినను ఎరుగనివాడే. అట్టివాడు చదివిన మూర్ఖుడు. అట్టి వాని వలన లోకమున కేప్రయోజనము లేదు. ఆకలి విషయమున అందరును ఒక్కటే. మనిషికి, జంతువు నకు, వృక్షమునకు మరియు రాయి, రప్పకు కూడ ఆకలి యుండును.

ఇతరుల ఆకలి తెలిసినవాడే మానవుడు. తెలియనివాడు మానవ రూపుడేగాని, పశుపక్ష్యాదుల కన్న హీనుడు. ఆకలికి అన్నము పెట్టువాడు, దాహమునకు నీరిచ్చువాడు, దరిద్రుని ఆదుకొను వాడు నాకు ప్రియుడు. ఇట్టి ప్రాథమిక ధర్మము నిర్వర్తించక, శుష్కవేదాంతమును పలుకువాడు నా దరి చేరలేడు. చేరినను అట్టివాని కెట్టి ప్రయోజ నము ఉండదు.

130

# నీ నిజస్వరూపము

సృష్టి యున్నంతవరకు శుద్ధచైతన్యముండును. సృష్ట్యంత్యము వరకు శుద్ధచైతన్యమే దైవముగ పనిచేయు చుండును. అది నిరాకారమయ్యు ఆకారము లందుండును. అవసరమగుచో తనకు తానుగ రూపుకట్టుకొని అవతరించును. దానికి జనన మరణములు లేవు. తమోగుణమున పదార్థము నాకర్షించుట, రజోగుణమున విసర్జించుట చేయుచు నుండును. తాను సత్త్వమైన వెలుగుగ నుండును. శుద్ధ సత్త్వమగు చైతన్యమది. దాని నాధారముగ చేసుకొని పదార్థము ఎనిమిది స్థితులలో, ఎనిమిది ఆవరణలు ఏర్పరచును.

శుద్ధ చైతన్యము వెండితెర వంటిది. వెలిగింపబడిన వెండితెరపై ఎట్లు అనేకానేక రూపములు, రంగులు, శబ్దములు నర్తించి అదృశ్యమగునో, అట్లే నామ రూపాత్మక మగు జగత్తు అంతయు శుద్ధ చైతన్యము ఆధారముగ గుణములతోను, పంచభూతములతోను రూపము లేర్పరచు కొనుచు, కాల పరిమితి ననుసరించి అంతమొందుచుండును. ఈ శుద్ధ చైతన్యమే సృష్టి యందలి దైవము. అది నీయందు నీవలె యున్నదని తెలియుము.

131

# మాయా ప్రభావము

సచ్చిదానందమగు ఒకే తత్త్వము అనేకమగు రూపములందు, అనేకమై గోచరించుట మాయా ప్రభావము.

సచ్చిదానందమగు తత్త్వమును దేవతలుగను, మానవులుగను, జంతువులుగను, వృక్షములుగను, పదార్థములుగను గ్రహించుట కూడ మాయావరణ ప్రభావమే. సచ్చిదానంద తత్త్వమును రూపము, గుణమును బట్టి వివిధముగ భావించుట మాయా ప్రభావమే.

నీయందెన్ని యంగములున్నను, నిన్ను నీవు "నేను" అనియే భావింతువు గదా! నీ మొత్తము రూపము నీవే అయినట్లు మొత్తము సృష్టిరూపము సచ్చిదానందరూపమే. ఇది తెలియనివాడు, తెలియనివాడు.

132

# నీవు - నేను

నీవు నాకన్న భిన్నము కాదు. ఈ జగత్తుకూడ నాకన్న భిన్నమైనది కాదు. నేను నీవలె, ఈ జగత్తువలె, జగత్తు నందలి అఖిల రూపములవలె గోచరింతును. అంతట నేనే నిండియుండగ యిక నీ వెక్కడున్నావు? సముద్రమే అలగ నుండగ అల అస్తిత్వము సముద్రమే కదా! సముద్రములేని అల లేదుకదా! అల తాత్కాలికము. సముద్రము శాశ్వతము. నీ వుండుట నే నుండుటయే. నేను శాశ్వతుడను. కనుక నీవును శాశ్వతుడవే.

133

# ద్వారకామాయి

నేనే నీవైయుండగ, నీవు ప్రత్యేకముగ యున్నట్లు భావించుటకు కారణము మాయయే. మాయ వలననే ఏకత్వము భిన్నత్వమువలె గోచరించును. ఈ మాయ వలననే చోటుయం దావరణ లేర్పడి లోకము లేర్పడు చున్నవి. ఒక లోకమునకు మరియొక లోకమునకు నడుమగల ఆవరణయే మాయ. గృహమునకు గడప వలె మాయ పనిచేయుచుండును. గృహమునకు "వెలుపల – లోపల" అను భావము కలిగించునది గడప లేక ద్వారమే కదా. అది లేనిచో వెలుపలేది? లోపలేది? అట్లే ఊర్ధ్వము అధస్సు, కుడిఎడమలు మాయవలన నీయందేర్పడిన ఆవరణలు, విభజనలు. చోటుకు విభజన లేనట్లే ప్రజ్ఞకు విభజనలు లేవు. ఉన్నట్లు గోచరింపజేయునదే మాయ. అదియే ద్వారకామాయి. ద్వారకామాయి యందుగల నన్ను ఆరాధించువారిని మాయ అంటదు.

134

# తెర తొలగింపు

మోహవశులై కొందరు జ్ఞానము పొందవలె నను కొందురు. మోహవశులై కొందరు జ్ఞాన మందించ ప్రయత్నింతురు. జ్ఞాన మందింపబడునది, అందు కొనునది కాదు. అది ఎపుడునూ యున్నది. శాశ్వత ముగ యున్నది. నీయందు నీవుగ, నాయందు నేనుగ యున్నది. ఉన్నదాని నందించుటయేమి? అది యుండనే యున్నదికదా. అజ్ఞానము తొలగించినచో మిగిలినదే జ్ఞానము.

జ్ఞానులు అజ్ఞానమను పొరను తొలగించుటకు యత్నింతురుకాని జ్ఞానము నందించుటకు యత్నింపరు. వారు చేయునది తెర తొలగింపు. శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీత యందు తెలిపినదియు నిదియే. "తత్త్వదర్శను లైన జ్ఞానులు అజ్ఞాన స్వరూప స్వభావములను వివరింతురు" అని భగవానుడు పలికినాడు.

135

## అన్నదానము

నీయందలి సద్గుణములు ప్రకాశింపవలె నన్నచో అన్నపానీయాదుల నొసగుట నీ దైనందిన జీవితమున భాగమై యుండవలెను.

పిడికెడన్నము పెట్టనివానియందు ఎన్ని సద్గుణము లున్నను అవి రాణించవు. చంద్రుడు లేని ఆకసము ఎట్లు ప్రకాశము లేక యుండునో, కమలములు లేని కొలను ఎట్లు కళా విహీనమై యుండునో, నీరులేని భవనము వశించుట కెట్లు అయోగ్యమో, గొంతులేని గాయకుడు ఎట్లు నిర్వీర్యుడో అట్లే అన్నము పెట్టని గుణవంతుని గుణములు నిరుపయోగములు.

నీవును నీ గుణములు ప్రకాశింపవలెనన్నచో శ్రద్ధగ ఆకలిగొన్నవానికి అన్నము పెట్టుము. పెట్టిన అన్నము రుచిగ కూడ యుండవలెను సుమా.

136

# అన్నసూక్తము

అన్ని దానములలోను అన్నదానము గొప్పది. అన్నమే సమస్త జీవులకు పోషణ నిచ్చునది, పుష్టి నిచ్చునదికూడ. దైవమే అన్నముగ నున్నాడని వేదములు ఘోషించుచున్నవి. అన్నమును దూషించ వలదని, అన్నము వృథా చేయకూడదని, అశ్రద్ధగ అన్నము పెట్టకూడదని, దీనులకు హీనులకు అన్న మిడక భుజింపకూడదని, కడుపునిండ రుచికర భోజనము ఆకలి గొన్నవానికి శ్రద్ధగ పెట్టుటలో జీవుని రూపమున జీవుడే సంతసించునని తెలియుము.

శ్రద్ధాభక్తులతో అన్నమును పెట్టుట ఆజన్మాంత దీక్షగ గడిపి కొందరు బ్రహ్మముచే పొందబడినారు. ఇంతకన్న సులభమగు మార్గము మరియొకటి లేదు.

137

# క్రతురాజము

కలియుగమున దానమిచ్చుటకన్న మించిన క్రతువు లేదు. ఇచ్చుట యజ్ఞము. ఇచ్చువానికి కర్మబంధములు తొలగును. ఇచ్చుట యందలి సౌఖ్యము పుచ్చుకొనుటలో లేదు. ఇచ్చుట నేర్చినవారు సర్వసౌఖ్యములకు, సర్వ భోగములకు అర్హులగుచుందురు. ఇచ్చుటయే క్రతువుగ జీవిత మంతయు నిర్వర్తించిన శిబి, బలి మొదలగు చక్రవర్తులు శాశ్వత సువర్గవాసులైరి. దైవ సాన్నిధ్యమును కూడ పొందిరి.

ఇచ్చుట యందలి రుచి మరిగినవాడు తనను సైతము దానమిచ్చుకొని పురుషమేధ మహాయజ్ఞమును కావించినవాడై శాశ్వత బ్రహ్మలోకమును పొందును. క్రతువులలో మకుటాయమానమైన క్రతువిది. క్రతురాజ మిది.

138

# సిద్ధుడు

సిద్ధుని అవగాహన చేసుకొనుటకు ప్రయత్నింపకుము. అది వృథా ప్రయత్నమే. అతడొకప్పుడు నవ్వుచునుండును. మరొకపుడు గంభీరుడై యుండును. ఇంకొకప్పుడు చచ్చిన వానివలె నిశ్చలుడై యుండును. అపుడపుడు నర్తించుచుండును. తనలోతాను మాట్లాడుకొనుచుండును. అకస్మాత్తుగ కోపము ప్రకటించును. వెంటనే ఆనందమును వ్యక్తము చేయును. మరుక్షణమే మౌనము వహించును. ఒకపుడు తండ్రివలె ప్రవర్తించును. అట్లే సోదరునివలె, మిత్రునివలె, శత్రువువలె, శిక్షకునివలె, బోధకునివలె ప్రవర్తించుచు నుండును.

అతడెందుకట్లు చేయునో అతనికే తెలియదు. నీకేమి తెలియగలదు. అతడు నీపట్ల ఎట్లు ప్రవర్తించినను నిన్ను అనుగ్రహించుటకే అని మాత్రము తెలియుము.

139

## గంగాధరుడు

అమ్మ అనుగ్రహము లేనిదే అడుగు ముందుకు పడదు. అమ్మ అనుగ్రహమున్నచో ఆకసమునునైన అందించును. అమ్మ ఒడిలోని బిడ్డకు కొరతేమి యుండ గలదు? అమ్మ తరువాతే అయ్య అని తెలియుము. అమ్మను సుఖపెట్టినచో అంతయు సుగమమే. రూపము లన్నియు అమ్మవే. జీవులందరు అమ్మ పిల్లలే. రూపములం దమ్మను చూచుచు, జీవులకు సంతోషము కలిగించుము. గంగాధరుడట్లు చేసి పరమహంస అయినాడు.

140

# నా బేరసారములు

నేను కొందరినుండే దక్షిణ లాశింతును. అందరి నుండి ఆశించను. బాకీపడిన వారినుండి, బాకీలు వసూలు చేయుట కూడ నా పనులలో యొకటి. బాకీలు వసూలు చేయుటవలన యిచ్చినవారికి జీవన భారము తగ్గును. వసూలైన బాకీలను అన్నముగ వండి పెట్టెదను. దాచుకొను బుద్ధి నా దగ్గర లేదు.

ద్వారకామాయికి వచ్చువారిలో కొందరి వద్ద వసూలు చేయుట, కొందరికి పంపిణీ చేయుట జరుగుచు నుండును. ఇచ్చుటకు పుచ్చుకొనుటకు జీవులు ద్వారకా మాయికి వత్తురు. ఎప్పటికప్పుడు వచ్చినది పోవుచునే యుండును. అంతా ద్వారకామాయియే నిర్వర్తించును. నేను సాక్షిగ యిచ్చి పుచ్చుకొనుటలు జరుగుచు నుండును.

141

## ఆకారుడు - నిరాకారుడు

దైవము ఆకారుడు, నిరాకారుడు కూడ. నిరాకార దైవము ఆకార దైవముకన్న గొప్పవాడని భావించుట అజ్ఞానము. రూపమున్నను లేకున్నను బంగారము బంగారమే కదా!

నిరాకారదైవము నారాధించుట గొప్పగ భావించు వారు అహంకారులు. పాశ్చాత్యులు సంకర్షణ వ్యూహమున బంధింపబడిన వారగుటచే రూపకుడగు దైవమును అహంకారము కారణముగ ఆరాధించలేరు.

ఆకాశము వెలుగే. ఆ వెలుగే సూర్యుని రూపమున ప్రాణమును, ప్రజ్ఞను జీవుల కందించు చున్నది. సూర్యుడే లేనిచో ఆకాశపు వెలుగు జీవులను చేరలేదు. జీవులు ఆకాశమునూ చేరలేరు.

అహంకారము తొలగుటకే ఆకారమున నున్న దైవము నారాధించుట. విగ్రహారాధన అందులకే. విగ్రహము రూపము వాహికగ దైవమందించు స్పర్శ నందుకొనుట సులభము.

142

# కర్మ - యోగము - దైవము

కర్మమార్గము అతి విచిత్రము. ఎంత తెలిసిన వాడైనను కర్మను నిర్వర్తించునపుడు కర్త తానే యను కొనును. కర్త తాను కాదని, దైవమే కర్తయని తెలిసిననూ చేయుచున్నపుడు తానే యుండును గాని దైవమునకు అవకాశమివ్వడు. దైవముతో కూడి చేయుట కర్మయోగ మగుచున్నది. దైవమునందు తానున్నచో దైవమే చేయుట కూడ జరుగును. ఇది దైవ యోగము. కర్మయోగమున నున్నవాడు అప్పుడప్పుడు యోగభ్రష్టు డగుచుండును. దైవయోగమున నున్నవాడు భ్రష్టు డగుటకు అవకాశము తక్కువ. ఈ రెండు యోగములు లేనివానికి పరిష్కారమే లేదు. అతడు కర్మలను నిర్వర్తించుచు అందలి సుళువు తెలియక తనను తాను బంధించుకొనును.

143

# సమస్య - సమర్పణ

మానవ జీవితమున సమస్యలు సామాన్యముగ వచ్చుచు పోవుచు నుండును. సమస్యలకు కాలపరిమితి యుండును. కాలము ద్వారా వచ్చిన సమస్య కాలము ద్వారానే సమసిపోవును. ఇంతలోపున సాధకునకు కావలసినది ఓర్పు. ఓర్పుతో కర్తవ్యమును నిర్వహించుచు అప్రమత్తుడై జీవించుట మాత్రమే సాధకుడు చేయవలెను. నిరుత్సాహ పడరాదు. తొందర పడరాదు. పరిష్కారమునకు అడ్డదారులు త్రొక్కరాదు. పరిష్కారమును తప్పించుకొని తిరుగరాదు.

దైవమునకు సమర్పణ చెంది కర్తవ్యమును ఓర్పుతో నిర్వర్తించుటకన్న సమస్యకు మరియొక పరిష్కారము లేదు.

144

# దక్షిణ - క్రీడ

నే నెవరినుండి దక్షిణలు అందుకొందునో వారి నాశీర్వదింతును.

కొందరినుండి దక్షిణ లంగీకరించను. పవిత్రత లేని దక్షిణ లంగీకరించను. గొప్పతనమున కిచ్చు దక్షిణల నంగీకరించను. అహంకారు లిచ్చు దక్షిణ లసలే అంగీకరించను.

కొందరినుండి అధికారివలె దక్షిణలు వసూలు చేసెదను. అట్లు చేయుట వారిని కర్మబంధమునుండి రక్షించుటకే.

కొందరు ఆపత్సమయమున దైవమునకు మ్రొక్కు కొని ఆపద తీరిన వెంట మరతురు. అట్టివారి దగ్గర నేనే స్వయముగ పోయి దక్షిణలు వసూలు చేతును.

దక్షిణల కార్యక్రమము నా కొక ముచ్చటైన క్రీడ.

145

# విభూతి

ధుని ఎప్పుడునూ వెలుగుచునే యుండవలెను. ధునిలో పడినది రూపాంతరము చెంది బూడిదయై మిగులును. అగ్ని సమస్తమును పవిత్రీకరించి బూడిదగ మిగుల్చును. ఈ బూడిద బూడిద కాదు. అది విభూతి. అగ్నిచే పవిత్రీకరింపబడినది. కావున అతి పవిత్రము. దానిని ఇక అగ్నికూడ యేమియు చేయలేదు. అగ్ని స్పృశింపలేనిది, నశింపు చేయలేనిది దైవతత్త్వ మొక్కటియే. కావున ధునినుండి వచ్చు విభూతి దైవవిభూతియే. దైవమే.

146

# నా వాగ్దానము

నా తండ్రి దయామయుడు. అతని దయ అపారము. అతడు నాకు అపారముగ తన సాన్నిధ్యము నందించు చుండును. ఆ సాన్నిధ్యమును మీ కందించుటకే నే నిచట యున్నాను. నే నందించునది మీరందుకొనక మీరేమేమో కోరుకొనుచున్నారు. మీరు కోరినవి నా తండ్రి దయవలన మీకు నే నిచ్చుచున్నాను. మీరు దైవ సాన్నిధ్యమును కోరుదురేమో యని ఎదురుచూచుచు యున్నాను. మీరది కోరరు. మీరది కోరునంతవరకు, కోరిన వెంటనే మీ కందించుటకు, నేను సమాధియందు వేచియున్నాను. కోరినవారి కోర్కెలు తీర్చుటయే నా సమాధి ప్రయోజనము. దైవము నాకిచ్చినది మీకు పరిపూర్ణముగ నిచ్చు వరకు నే నిచ్చుటనే యుందును. ఇది నా వాగ్దానము.

147

# అహింస

ఉపవసించుట యనగా దైవముతో నుండుటయే. మరియేదియు ఉపవాసము కాదు. ఇతర ఉపవాసములు దైవసాన్నిధ్యమునకు తోడ్పడవు. అవి శుష్కములు.

ఉపవాసము పేరున భోజనము మానుట హింస యగును. హింస యోగమునకు వ్యతిరేకము. అహింస స్వవిషయమున కూడ పాటింపబడవలెను.

148

# వేచియుండుట

కామ్యకర్మనే నిర్వర్తించుచున్నను, సంపదను సద్వినియోగమే చేయుచున్నను, ధర్మ సూత్రములను పాటించుచు యున్నను ఆత్మానుభూతి కలిగి తీరవలెనని నియమము లేదు. గురుస్పర్శ ద్వారా ఆత్మానుభూతి సులభముగను, శీఘ్రముగను పొందవచ్చును. కావున ధార్మికుడవై, గురుస్పర్శ కొరకు వేచియుండుము. వేచియుండుట ఒక కళ.

149

# మార్గము

ఆత్మానుభూతి పొందగోరువాడు ఆచరణ మార్గమున మనస్సు, యింద్రియములు, శరీరమును ప్రతినిత్యమును పరిశుద్ధి గావించుకొని దైవ సాన్నిధ్యమునకై మానసికముగ వేచియుండవలెను. శుద్ధి లేనిచో సాన్నిధ్యానుభూతి యుండదు. కేవలము శుద్ధి వలననే సిద్ధి కలుగదు. శుద్ధికి సిద్ధికి నడుమ నుండునది అనుగ్రహము. కర్తవ్యముల నాచ రించుచు, కృపకై వేచియుండుటయే మార్గము.

150

## డంబాచారులు

గొంగళిపురుగు సీతాకోక చిలుక అగుట మౌనముగ నిశ్శబ్దమున జరుగును. ఆ మొత్తము మార్పంతయు రహస్యముగ జరుగును. హడావిడి అసలుండదు. అట్లే అంతర్ముఖముగ తపస్సు గావించువానికి హృదయమున సమస్తమగు మార్పులు జరిగి సాధన సిద్ధినిచ్చును.

డంబాచారులే సాధనను గూర్చి, సద్గురువు గూర్చి మిక్కుటముగ మాటాడుచుందురు. తామెంత సాధన చేయుచున్నామో, యితరులకు తెలియవలెనని తమను గూర్చిన డంబములు పలుకుదురు. ఇట్టివారే తరచు గోచరింతురు. సత్సాధకులు అరుదుగ గోచరింతురు. వారు బయటకు అగుపడనే అగుపడరు.

సాధన పూర్తిగాకుండ బయటపడువారు పూర్వ స్థితిలేక ఉత్తర స్థితిలేక రెంటికి చెడ్డ రేవడు లగుదురు. ప్రస్తుత కాలమున వీరే మెండుగ నున్నారు.

151

## నా శిష్యరికము

నీ దృష్టిలో నేను సద్గురువును. కాని నేను కూడ నా గురువునకు శిష్యుడనే. నేను నా గురువు నెట్లనుసరించితినో నీకు తెలియునా?

అతడు చెప్పినది చెప్పినట్లుగ చేసితిని. అతని నెప్పుడూ అనుసరించితిని. అతని నెన్నడూ ప్రశ్నింప లేదు. నా కతడే సర్వస్వము. అతడే నా నివాసము. అతడే నా సంపద. అతడే ధనము. అతడే నా ఆరోగ్యము, ఐశ్వర్యము. తల్లియు తండ్రియు కూడ నా కతడే. నా మనస్సతనియందే లగ్నమై యున్నది. నేను, నా మనస్సు, నా యింద్రియములు, నా శరీరము అతని సేవకే అంకితము. నాయందతడే నిండియున్నాడు. అతనియందు నేను అణు మాత్రముగ నున్నాను.

152

# హృదయ తంతువు

ఎవరైనను నీకు సహాయమందించిన వారి హృదయము నెరిగి ప్రతిస్పందించుము. ఆలోచించకయే నిరాకరించకుము. ఆలోచించక అంగీకరించకుము. నిన్నెవరైన కోరినను, నీ కెవరైన సహాయమందించ దలచి నను, మనస్సుతో స్వీకరించి, హృదయమునకు నివేదించుము. నీవపుడు సరిగ ప్రతిస్పందింతువు.

నే నెవరి రూపముననైనను నీకు సహాయపడగలను. ఎవరి రూపముననైనను నిన్నుకోరి చూతును. నీవు చూచు, విను విషయములను హృదయముతో చూచుట, వినుట, చేయుట నేర్చుము. ఇట్టి సాధనలో నీ కపుడపుడు నేను దర్శన మివ్వవచ్చును. అందువలన యిచ్చి పుచ్చుకొను వ్యవహారములలో నన్ను దర్శించుట క్షేమము. దానికి మనస్సునుగాక హృదయమును సంప్రదించుచు నుండుము. హృదయమే నిన్ను, నన్ను కలుపు తంతువు.

153

# మార్గదర్శి - మార్గము

కీకారణ్యమున దారికొరకై వెదకువాడు తిరిగిన చోట్లయందే తిరుగుచు అలసట చెందును. ప్రపంచమున సరియగు దైవమార్గము దొరకుటకూడ అట్లే అగమ్య గోచరముగ నుండును. అరణ్యమున మార్గమునకై వెతకు వానికి అపాయమగు పరిస్థితులు గూడ ఏర్పడగలవు. అట్లే మార్గాన్వేషణమున సాధకునకు అపాయకరమగు మార్గములు తారసిల్లగలవు.

పూర్వ సంస్కారమును బట్టి సద్గురువు లభించుట జరుగును. కుసంస్కారికి అట్టి గురువే దొరకును. సంస్కారికి సద్గురువు లభ్యమగును.

సద్గురువు మార్గదర్శి. అనగా మార్గమును చూపువాడు. సద్గురువు దొరికెనని సంతసించి చతికిల పడకుము. అతడందించిన మార్గమున నడచుటకు ప్రయత్నింపుము. మార్గానుసరణమునకే మార్గదర్శి అని తెలియుము.

154

# చతుర్విధ దీక్ష

ఆత్మచే నాత్మ నుద్ధరించుకొనుము. ఆలోచనల అంతు చూడుము.

మారుచున్న జగత్తునందు మారని దానిని గుర్తించు చుండుము.

సద్గురువును హృదయమున గ్రహించి మనస్సు, యింద్రియము, శరీరములతో దైనందిన కర్తవ్యములను నిర్వర్తింపుము.

నేనిచ్చు చాతుర్మాస దీక్ష యిదియే.

155

## ఒక రహస్యము

సద్గురువు పాద సన్నిధిని మృతిచెందు జీవికి ఉత్తర గతులు తప్పనిసరి. అందరికిని యిట్టి అదృష్టము లభించదు.

సద్గురు సాన్నిధ్యము భౌతికము కాదు గనుక సద్గురు స్మరణమున మరణించినను సద్గతియే యుండును.

సద్గురు కనులలోనికి చూచుచు మరణించిన జీవి మానవుడైనను, గోవైనను, పులియైనను, సునకమైనను, చివరికి కాకియైనను ఉత్తమోత్తమ గతులు పొందగలవు.

మరణ సమయమున దేనిని భావింతువో అది నీకు మరుజన్మలో సిద్ధించును.

156

# నా స్వభావము

నీవు నీ మనస్సుతోను, యింద్రియములతోను నన్ను షిరిడీలో మూడుబారల మనిషిగ చూచుచున్నావు. నేను షిరిడీలో నుండుట సత్యము. షిరిడి నా నివాసము. నన్ను స్మరించువారి హృదయములన్నియు షిరిడీయే అయివున్నవి. అందు నేనే నివసింతును. కావున షిరిడీ ఒక్క ప్రదేశముననే లేదు. భక్తుల హృదయములన్నియు నా నివాసములే. నేను వసించు షిరిడీలే.

నన్ను స్మరించువారిని వారి హృదయము నుండియే నడిపింతును. ఇది నా స్వభావము. ఇది నా వాగ్దానము కూడ. నీవు పిలచినచో నీ హృదయమునుండి పలుకగలను.

157

## శాస్త్ర ప్రయోజనము

సద్గ్రంథములను శ్రద్ధతో పఠించుము. ఏమియు ఆశింపక పఠింపుము. సద్గ్రంథ పఠనము ఇచ్చు ఫలము జ్ఞానము. నిత్యానిత్య వస్తువివేకము నందించునదే జ్ఞానము. దానివలన నిత్యమునందు మనసు లగ్నము చేయక, అనిత్యమగు విషయములు కాలమునకు, కర్మమునకు వదలివేయుట వీలగును. చిల్లర కోరికలన్నియు నిన్ను వీడును. చిత్తభ్రమలు, భ్రాంతి, భయము, ఆదుర్దాలు ఎగిరిపోవును. స్థిరమగు శాంతి చిత్తమునకు లభించును. వెలుగుదారులు గోచరించును. ఆ దారులలో నడచుటకు స్ఫూర్తి కలుగును. సద్గురువనుగ్రహము కలుగును. సర్వసిద్ధికి మార్గములు తెరువబడును.

158

# ప్రయత్నము - సిద్ధి

సద్భావనతో మరణించిన సద్గతి ఏర్పడును. భయముతో మరణించిన భయ మేర్పడును. మమకార ముతో మరణించిన మమకార బంధములతో పుట్టును. మరణ సమయమున నీ వేది మిక్కుటముగ భావింతువో అదియే నీకు దక్కును.

మరణ సమయమున సద్విషయము భాసించవలె నన్నను, భావించవలె నన్నను అది నీ చేతిలో లేదు. జీవితమున ఏ భావము నీవు ప్రధానముగ జీవింతువో, ఆ భావమే మరల నీకు జీవితాంతమున నిలచును.

మరణించినపుడు దైవస్మరణ, గురుస్మరణ జరుగ వలెనన్నచో, జీవించుచున్నప్పుడు అట్టి స్మరణ ప్రధాన ముగ జీవనము సాగవలెను. ప్రయత్నము లేని సిద్ధి లేదు అని ఎరుగుము.

159

## అనాయాసము - అధికాయాసము

అభ్యాసమునకు గురువే బలము. యోగాభ్యాసము గురుబలమున నిర్వర్తించుకొనువాడు బుద్ధిమంతుడు. గురుబల మున్నచోట ప్రయత్న మనాయాస మగును. అది లేనిచోట పూర్వపుణ్యఫలము నిలువగలదు. పూర్వ పుణ్యఫలము బలము కూడ లేనిచోట అధికాయాసమే యుండును.

160

## ఆవలి గట్టు

నేను జన్మమెత్తుట మీ కొరకే. నే ననంతుడను. నేను త్రిగుణాతీతుడను. త్రిగుణముల ద్వారమున నవతరించి మీకు దృశ్యుడ నగుదును. నా కున్ముఖులైన వారిని త్రిగుణ ముల కావలి తీరమున చేర్చుదును. ఈవలివారిని ఆవల చేర్చుటయే నా పని. ఆవల చేరవలెనన్న ఆకాంక్ష వున్న వారినే కొనిపోదును. అట్టి ఆకాంక్ష లేనివారిని వారి స్వతంత్రతకు వదలి వేయుదును.

161

# సాన్నిధ్యము

సర్వమతముల సందేశము సాన్నిధ్యమే. దైవ సాన్నిధ్యము అన్ని విధముల నిన్ను పరిపూర్ణుని గావించును. సాన్నిధ్యమహిమ నీ వెరుగజాలవు. నేనును ఎరుగజాలను. ఎవ్వరును ఎరుగజాలరు. నిశ్శబ్దము సాన్నిధ్య మొసగు స్వభావము. సాన్నిధ్యము భాష కందనిది. భాష లేనిది కూడ. నిశ్శబ్దమందు మనసు సాన్నిధ్యమునకు చేరువగును. మనోనిశ్శబ్దము అనగా భావరహిత స్థితి. అట్టి స్థితిలో సాన్నిధ్యము హృదయము నుండి మనో ద్వారమున యింద్రియములను, శరీర ధాతువులను ఆక్రమించి మొత్తము శరీర తత్త్వమును దివ్యత్వముతో నింపును. అపుడంతయు దివ్యమే యగును. దివ్యమే గోచరించును. దివ్యజీవనమే శాశ్వతమై నిలచును.

స్వస్తి.

*Dhanista Publications*

# OTHER BOOKS THROUGH
## MASTER K. PARVATHI KUMAR

*The following books are available in: English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (HI) and Kannada (K) languages.*

**BOOKS :**

| | | |
|---|---|---|
| 1. | MITHILA –A New Age Syllabus | E/G/S |
| 2. | THE AQUARIAN MASTER | E/G/S |
| 3. | SOUND –The Key & its Application | E/G/S |
| 4. | ASHRAM LEAVES | E/G/S |
| 5. | SANKHYA –The Sacred Doctrine | E/G/S |
| 6. | VENUS –The Path to Immortality | E/G/S |
| 7. | THEOSOPHICAL MOVEMENT | E/G/S |
| 8. | SHIRDI SAI SAYINGS | E/G/S |
| 9. | SPIRITUALITY IN DAILY LIFE | S |
| 10. | THE MASTERS OF WISDOM | S |
| 11. | MEDITATION & GAYATRI | S |
| 12. | WISDOM TEACHINGS OF VIDURA | E/G/S |
| 13. | ON HEALING | E/G/S |
| 14. | SPIRITUAL FUSION OF EAST & WEST | E |
| 15. | SRI SASTRY GARU | E/G/S/F/T |
| 16. | THE AQUARIAN CROSS | E/G/S |
| 17. | HERCULES –The Man & the Symbol | E/G/S |
| 18. | MANTRAMS –Their Significance & Practice | E/G/S |
| 19. | SRI DATTATREYA | E/G/S/T/HI |

| | | |
|---|---|---|
| 20. | SATURN –The Path to Systematised Growth | E/S |
| 21. | JUPITER –The Path of Expansion | E/S |
| 22. | MASTER E.K. –The New Age Teacher | E/G/S |
| 23. | AMANASAKUDU | T/K |
| 24. | VRUTRASURA RAHASYAM | T |
| 25. | THE DOCTRINE OF ETHICS | E |
| 26. | DHANAKAMUNI KATHA | T |
| 27. | ANTARDARSANA DHYANAMULU | T |
| 28. | THE SPLENDOR OF SEVEN HILLS | E/T/Hi |
| 29. | DOCTRINE OF ETERNAL PRESENCE | E |
| 30. | ASANGUDU | T |
| 31. | SARASWATHI - THE WORD | E |
| 32. | MANA MASTARU GARU | T |
| 33. | GEETOPANISHAD (Sankhya Yogamu) | T |
| 34. | GEETOPANISHAD (Karma Yogamu) | T |
| 35. | ‘OM’KARAM | T |
| 36. | JYOTIRLINGA YATRA | T |
| 37. | SRI LALITHA | T |
| 38. | KATHA DEEPIKA | T |
| 39. | MASTER C.V.V. (Birthday Message) | T |
| 40. | MAITREYA MAHARSHI BODHALU | T |
| 41. | MARUVU MAHARSHI BODHALU | T |
| 42. | DEVAPI MAHARSHI BODHALU | T |
| 43. | HIMALAYA GURU PARAMPARA | T |
| 44. | OCCULT MEDITATIONS | E |
| 45. | Master C.V.V. - The Initiator - Master E.K. The Inspirer | E |

**BOOKLETS :**

| | | |
|---|---|---|
| 1. | LORD MAITREYA -The World Teacher | E/G/S/F |
| 2. | THE WHITE LOTUS | E/G/S |
| 3. | WISDOM BUDS | E/G/S |
| 4. | SPIRITUALISM, BUSINESS & MANAGEMENT | E/G/S |
| 5. | THE PATH OF SYNTHESIS | E |
| 6. | THE ETHERIC BODY | E/G/S |
| 7. | MARIA MAGDALENA | E/G/S |
| 8. | TIME, THE KEY | E/G/S |
| 9. | LISTENING TO THE INVISIBLE MASTER | E/G/S/F/H |
| 10. | GOOD FRIDAY | E/G/S/F/H |
| 11. | BHRIKTA RAHITA TARAKA RAJAYOGAMU | T/K |
| 12. | MARRIAGE - A SACRAMENT | E |
| 13. | MASTER C.V.V. YOGAMU-KARMARAHITYAMU | T |
| 14. | POOJA VIDHANA PRASASTYAMU | T |
| 15. | GAYATRI MANTRA PRASASTYAMU | T |
| 16. | BHARATEEYA SAMPRADAYAMU | T |

**ధనిష్ఠ ఇతర ప్రచురణలు :**

1. శ్రీ వినాయక వ్రతకల్పము
2. శ్రీ శరన్నవరాత్ర పూజావిధానము
3. శ్రీ హనుమాన్ చాలీసా
4. శ్రీ సూర్య పూజావిధానము
5. శ్రీ శివ హృదయము
6. శ్రీ మహాలక్ష్మి పూజావిధానము
7. శ్రీ వేంకటేశ్వర పూజావిధానము
8. శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము
9. పురాణ పురుషుని పూజా విధానము